RNI No: TELTEL/2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | బుధవారం | పేజీలు 8 | లింగబత్తిని కృష్ణ
సంపుటి: 4 సంచిక:89 | మార్చి 18, 2026 | వెల: రూ.3-00 | సీఎండీ & ఎడిటర్
9701923260

## మొయినాబాద్
## డ్రగ్స్ కేసుపై ఉచ్చు

- రంగంలోకి ప్రత్యేక దర్యాప్తు బృందం
- తొమ్మిది మంది అధికారులతో కూడిన స్పెషల్ టీం ఏర్పాటు
- నిందితుల కస్టడీ, ఫామ్‌హౌస్ సీజ్ కోసం చర్యలు
- పోలీస్ కమిషనర్ పర్యవేక్షణలో వేగవంతమైన విచారణ

2లో

## ప్రేమ.. పెళ్లి.. ఆపై మర్డర్..!
### యూట్యూబర్ వైష్ణవిని హత్య చేసిన భర్త

- మృతురాలు నాలుగు నెలల గర్భిణీ
- కోరుట్ల మండలం మాదాపూర్ దారుణం




2లో

## నేను బతికే ఉన్నాను.. నన్ను చంపిందెవరు..?
### మీ కళ్లముందే ఉన్నాను కదా.. వృద్ధురాలి ఆవేదన

- రికార్డుల్లో మృతిచెందినట్లు నమోదు చేసిన అధికారులు
- మూడేళ్లుగా పింఛన్ నిలిపివేత
- పలుమార్లు మొరపెట్టుకున్నా స్పందన కరువు
- రికార్డుల్లో పేరు మాయం.. కొత్త దరఖాస్తుకు అడ్డంకులు

2లో



## 15 నెలల చికిత్స.. రూ.50 లక్షలు ఖర్చు!
### అయినా నిలువని ప్రాణం.. కుక్క కాటుతో బాలుడు మృతి

- కన్నీరు మున్నీరుగా విలపించిన తల్లిదండ్రులు
- వెల్గటూరు మండలం కోటిలింగాలలో విషాదం



2లో

## రక్తంతో తడిసిన కాటన్లు.. ఇంజక్షన్‌లు
### రోడ్డు పక్కనే వైద్య వ్యర్థాలు


- ప్రజల ప్రాణాలతో ఆటలాడుతున్న నిర్లక్ష్యం
- ఆందోళనలో ప్రజలు, రైతులు
- వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్



2లో

## కళ్లలో కారం చల్లి కోటి కొట్టేశారు..

- బైక్‌పై నగదు తరలిస్తున్న ఇద్దరిపై దాడి
- కూకట్‌పల్లిలో సినీ ఫక్కీలో దోపిడీ
- సీసీ కెమెరాల ఆధారంగా నలుగురిని అరెస్టు చేసిన పోలీసులు
- దోపిడీలో బాధితుడే కీలక పాత్రధారి?



2లో

# అడిగేదెవరు.. ఆపేదెవరు?

వేద న్యూస్, ఫోకస్ టీమ్


హన్మకొండ జిల్లాలో మట్టి మాఫియా రెచ్చిపోతుంది. విద్యానగరిగా పేరుగాంచిన ఈ జిల్లాలో, ముఖ్యంగా పలివేల్పుల ప్రాంతంలో అక్రమార్కులు బరితెగిస్తున్నారు. పగలు ప్రశాంతంగా కనిపించే ఈ శివారు ప్రాంతాలు, చీకటి పడగానే జేసీబీలు, ట్రాక్టర్ల మోతతో దద్దరిల్లుతున్నాయి. ప్రభుత్వ భూములతో పాటు, ప్రతిష్టాత్మక కాకతీయ విశ్వవిద్యాలయానికి కేటాయించిన స్థలాలను, చివరకు ఎస్సారెస్పీ భూములను కూడా వదలకుండా మట్టి మాఫియా దర్జాగా తవ్వేస్తూ సొమ్ము చేసుకుంటోంది. ఇష్టానుసారంగా సాగుతున్న ఈ తవ్వకాల వల్ల భూమి స్వరూపం మారిపోవడమే కాకుండా, పర్యావరణానికి తీవ్ర ముప్పు వాటిల్లుతోందని స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ భారీ దోపిడీ వెనుక స్థానిక ప్రజా ప్రతినిధుల అండదండలు పుష్కలంగా ఉన్నాయనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. తమ అక్రమాలకు అడ్డురాకుండా పోలీసులను, ఇతర అధికారులను సైతం మాఫియా గ్యాంగ్ తమ గుప్పిట్లో పెట్టుకున్నట్లు తెలుస్తోంది. పలుమార్లు పోలీసులకు ఫిర్యాదు చేసినా స్పందన లేకపోవడం, రెవెన్యూ, మైనింగ్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం పలు అనుమానాలకు తావిస్తోంది. మమ్మల్ని అడిగేదెవరు..? ఆపేదెవరు? అనే చందాన రెచ్చిపోతున్న అక్రమార్కుల దందాపై జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్ తక్షణమే జోక్యం చేసుకోవాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన బాట పడతామని పలివేల్పుల గ్రామస్థులు హెచ్చరిస్తున్నారు.



## బరితెగిస్తున్న మట్టి మాఫియా..!
### కేయూ, ఎస్సారెస్పీ భూముల్లో అక్రమ తవ్వకాలు

- పలివేల్పులలో బరితెగించిన భూ బకాసురులు
- పగలు ప్రశాంతం..రాత్రి అయితే యంత్రాల మోత
- జేసీబీలతో తవ్వకాలు.. ట్రాక్టర్లతో రవాణా
- భారీగా ఏర్పడుతున్న గుంతలు
- పోలీసులు, అధికారుల కనుసన్నల్లోనే మట్టి దోపిడీ..?
- ఆందోళనలో పలివేల్పుల ప్రజలు
- కలెక్టర్, సీపీ జోక్యం చేసుకొని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని గ్రామస్తుల డిమాండ్

2లో



వేద న్యూస్

బుధవారం | మార్చి 18, 2026

# నేను బతికే ఉన్నాను.. నన్ను చంపిందెవరు..?

## మీ కళ్లముందే ఉన్నాను కదా..

## వృద్ధురాలి ఆవేదన

- రికార్డుల్లో మృతిచెందినట్లు నమోదు చేసిన అధికారులు
- మూడేళ్లుగా పింఛన్ నిలిపివేత
- పలుమార్లు మొరపెట్టుకున్నా స్పందన కరువు
- రికార్డుల్లో పేరు మాయం.. కొత్త దరఖాస్తుకు అడ్డంకులు

**వేద న్యూస్, కోనరావుపేట**



రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం నిజామాబాద్ గ్రామానికి చెందిన మాదాసు నర్సవ్వ అనే వృద్ధురాలి పరిస్థితి అధికారుల నిర్ల క్ష్యానికి నిదర్శనంగా నిలిచింది. బతి కుండగానే ఆమెను రికార్డుల్లో మృతురాలిగా నమోదు చేయడంతో గత మూడు సంవత్సరాలుగా ఆమెకు రావాల్సిన పింఛన్ నిలిచిపో యింది. తన సమస్యను పరిష్కరిం చాలంటూ పలుమార్లు అధికారుల వద్ద మొరపెట్టుకున్నప్పటికీ ఎలాంటి స్పందన లభించలేదని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేస్తోంది. రికార్డుల్లో జరిగిన తప్పిదం కారణంగా ఇప్పుడు కొత్తగా పింఛన్ కోసం దరఖాస్తు చేసుకోవాలన్నా సాంకేతిక అడ్డంకులు ఎదురవుతున్నాయి. ఆన్‌లైన్ రికార్డుల్లో తన పేరు కనిపించకపోవడంతో కొత్త దరఖాస్తు చేసుకునే అవకాశం కూడా లేకుండా పోయిందని ఆమె తెలిపింది. భర్త మరణంతో ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న నర్సవ్వకు పింఛన్ నిలిచిపోవడం మరింత కష్టాలను తెచ్చిపెట్టింది. ప్రభుత్వ రికార్డుల పొరపాటుతో జీవిస్తున్న వ్యక్తిని మృతురాలిగా చూపించడం తీవ్ర అన్యాయం అని గ్రామస్తులు మండిప డుతున్నారు. 'నేను బతికే ఉన్నాను.. మీ కళ్లముందే తిరుగుతున్నాను కదా.. ఇంకెలా నిరూపించుకోవాలి?' అంటూ నర్సవ్వ వేదన వ్యక్తం చేసింది. బ్రతికున్న వ్యక్తిని మృతురాలిగా నమోదు చేయడం ఎలా జరిగిందో అధికారులే చెప్పాలంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటి కైనా జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులు స్పందించి రికార్డులను సరిచేసి బాధితురాలికి పింఛన్ పునరుద్ధరించాలని గ్రామస్తులు, మేధావులు డిమాండ్ చేస్తున్నారు.

# 15 నెలల చికిత్స.. రూ.50 లక్షలు ఖర్చు!

## అయినా నిలువని ప్రాణం.. కుక్కకాటుతో బాలుడు మృతి

**వేద న్యూస్, వెల్గటూరు**



జగిత్యాల జిల్లా వెల్గటూరు మండలం కోటిలింగాల గ్రామానికి చెందిన మణితేజ (8) కుక్కకాటుకు గురై దీర్ఘకా లిక చికిత్స అనంతరం మృతి చెందాడు. ఈ ఘటన గ్రామంలో విషాదాన్ని నింపింది. 2024 డిసెంబర్ 26న ఇంటి బయట ఆడుకుంటున్న సమయంలో వీధికుక్క మణితేజను కరిచింది. వెంటనే ఆసుపత్రికి తరలించి టీకా వేయించి ఇంటికి తీసుకు వచ్చారు. అయితే కొద్దిసేపటికి జ్వరం రావడంతో జగిత్యాల ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లగా, పరిస్థితి విష మించడంతో హైదరాబాద్‌కు తరలించాలని వైద్యులు సూచించారు. హైద రాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రిలో పరీక్షలు నిర్వహించిన వైద్యులు వెన్నుముక నుండి మెదడుకు వెళ్లే నరం దెబ్బతిన్నట్లు తెలిపారు. అప్పటి నుంచి బాలుడు పూర్తిగా స్పందించకుండా వెంటిలేటర్‌పై చికిత్స పొందుతూ వచ్చాడు. బాలుడి ప్రాణాలు కాపాడేందుకు కుటుంబ సభ్యులు సుమారు రూ.50 లక్షలు ఖర్చు చేసినప్పటికీ, చివరకు మణితేజ మృతి చెందాడు. కుమారుడిని కాపాడలేకపోయిన తల్లిదండ్రులు శ్రీనివాస్, మాధవి దంపతులు కన్నీటి పర్యంతమయ్యారు.

## మోయినాబాద్ డ్రగ్స్ కేసుపై ఉచ్చు

### రంగంలోకి ప్రత్యేక దర్యాప్తు బృందం

**వేద న్యూస్, హైదరాబాద్**

మోయినాబాద్ ఫామ్‌హౌస్ మత్తు పదార్థాల కేసులో రాష్ట్ర ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోంది. కేసును లోతుగా విచారించి అసలు సూత్రధా రులను పట్టుకునేందుకు తొమ్మిది మంది సభ్యులతో కూడిన ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసింది. సైబరాబాద్ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు పర్యవేక్షణలో ఈ బృందం పనిచేయనుంది. ఈ ప్రత్యేక బృందానికి చేవెళ్ల పోలీసు అధికారి యోగేష్ గౌతమ్ నాయకత్వం వహించ నున్నారు. సభ్యులుగా రవీందర్ రెడ్డి, శిరీష, బుచ్చయ్య, హరీశ్ చంద్రారెడ్డి, మల్లిఖార్జున, కోటేశ్వర్ రావు, వెంకన్న, సదత్ అలీ ఉన్నారు. మత్తు పదార్థాల నెట్‌వర్క్‌ను ఛేదించడం, నిందితుల నుంచి కీలక సమాచారాన్ని రాబట్టడం ఈ బృందం ప్రధాన బాధ్యతగా ఉంటుంది. ప్రాథమిక విచార ణలో పైలట్ రోహిత్ రెడ్డికి చెందిన ఫామ్‌హౌస్‌లో అసాంఘిక కార్యకలా పాలు జరిగాయని అధికారులు గుర్తించారు. ఈ మేరకు ఫామ్‌హౌస్‌ను స్వాధీనం చేసుకోవాలని రెవెన్యూ అధికారులకు లేఖ రాశారు.

# అడిగేదెవరు? ఆపేదెవరు?

**వేద న్యూస్, ఫోకస్ టీమ్**



విద్యానగరిగా వెలుగొందుతున్న హన్మకొండ జిల్లాలో భూ మాఫియా బరితెగిస్తోంది. పలివే ల్పుల ప్రాంతంలో అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. పగలు ప్రశాంతంగా కనిపించే ఈ ప్రాంతం, రాత్రి కాగానే యంత్రాల మోతతో దద్దరిల్లుతోంది. ప్రభుత్వ భూములను, చివరకు విద్యాసంస్థలకు (కేయూ)కేటాయించిన స్థలాలను, ఎస్సార్‌ఎస్పీ భూములను కూడా వదలకుండా మట్టి మాఫియా దర్జాగా తవ్వేస్తూ సొమ్ము చేసుకుం టోంది.

### రాత్రివేళల్లో యథేచ్ఛగా మట్టి దోపిడీ

పలివేల్పుల శివారు ప్రాంతాల్లోని విద్యాసంస్థల ప్రాంగణాలు, ప్రభుత్వ భూములే లక్ష్యంగా ఈ అక్రమ తవ్వకాలు కొనసాగుతున్నాయి. రాత్రికి రాత్రే జేసీబీలు, ట్రాక్టర్లతో రంగంలోకి దిగుతున్న మాఫియా, భారీ ఎత్తున మట్టిని తర లిస్తోంది. భూమిని ఇష్టానుసారంగా తవ్వేయడం వల్ల అక్కడ భారీ గోతులు ఏర్పడి, పర్యావరణానికి ముప్పు వాటిల్లడమే కాకుండా భవిష్యత్తులో ఆ భూమి దేనికీ పనికిరాకుండా పోయే ప్రమాదం ఉందని స్థానికులు భయాం దోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల అనుమ తులు లేవు, నిబంధనల ఊసే లేదు.. అంతా మాఫియా ఇష్టారాజ్యంగా సాగుతోంది.

### ప్రజాప్రతినిధుల అండదండలు?

ఈ అక్రమాలపై స్థానిక ప్రజలు పలుమార్లు పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఫలితం శూన్యం. ఫిర్యాదు చేసినా పట్టించుకోని పోలీసుల తీరుపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మేము సమాచారం ఇస్తున్నా పోలీసులు స్పందించడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. దీని వెనుక స్థానిక ప్రజాప్రతిని ధుల అండదండలు పుష్కలంగా ఉన్నాయని, వారి అండ చూసుకునే మాఫియా గ్యాంగ్ తమని ఎవరూ ఏమీ చేయలేరు అంటూ విర్రవీ గుతున్నారని స్థానికులు అంటున్నారు.



### నిద్రపోతున్న అధికారులు..!?

నగర నడిబొడ్డున, అందునా విద్యాసంస్థల ప్రాంగణాల్లో ఇంతటి భారీ స్థాయిలో తవ్వకాలు జరుగుతున్నా, రెవెన్యూ, మైనింగ్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం పలు అను మానాలకు తావిస్తోంది.

ప్రభుత్వ ఆస్తులను కాపాడాల్సిన బాధ్యత కలిగిన అధికారులు కళ్లు మూసుకుని కూర్చోవడం వెనుక ఉన్న మతలబు ఏంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం భూ మాఫియాకు వరంగా మారిందని, తక్షణమే ఉన్నతాధికారులు స్పందించకపోతే ఈ అక్రమాలు మరింత ముదిరే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

### ఆందోళన బాటలో గ్రామస్తులు

తమ ఊరి భూములను, ప్రభుత్వ ఆస్తులను కాపాడుకోవడానికి పలివేల్పుల ప్రజలు ఏకం అవుతున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్ ఈ విషయంలో జోక్యం చేసుకోవా లని వారు కోరుతున్నారు. తక్షణమే తవ్వకాలను నిలిపివేసి, ఈ అక్రమాలకు పాల్పడుతున్న సూత్రధారులను, వారికి సహకరిస్తున్న అధికా రులను, ప్రజాప్రతినిధులను కఠినంగా శిక్షించా లని డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని గ్రామస్థులు హెచ్చరిస్తున్నారు.

## బరితెగిస్తున్న మట్టి మాఫియా..!

- కేయూ, ఎస్సార్‌ఎస్పీ భూముల్లో అక్రమ తవ్వకాలు
- పలివేల్పులలో బరితెగించిన భూబకాసురులు
- పగలు ప్రశాంతం.. రాత్రి అయితే యంత్రాల మోత
- జేసీబీలతో తవ్వకాలు.. ట్రాక్టర్లతో రవాణా
- భారీగా ఏర్పడుతున్న గుంతలు
- పోలీసులు, అధికారుల కనుసన్నల్లోనే మట్టి దోపిడీ..?
- ఆందోళనలో పలివేల్పుల ప్రజలు
- కలెక్టర్, సీపీ జోక్యం చేసుకొని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని గ్రామస్తుల డిమాండ్





# రక్తంతో తడిసిన కాటన్లు.. ఇంజక్షన్‌లు

**వేద న్యూస్, బోయినిపల్లి**

## రోడ్డు పక్కనే వైద్య వ్యర్థాలు

- ప్రజల ప్రాణాలతో ఆటలాడుతున్న నిర్లక్ష్యం
- ఆందోళనలో ప్రజలు, రైతులు
- వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల పరిధిలో దేశాయిపల్లి వెళ్లే రహదారి మధ్యలో మర్లపేటకు వెళ్లే మట్టి రోడ్డుకు పక్కన ఉన్న కల్వర్ట్, బ్రిడ్జిపై ప్రమాదకర పరిస్థితి నెలకొంది. గుర్తుతెలియని వ్యక్తులు అనారోగ్యానికి గురైన వారికి ఉపయోగించిన ఇంజక్షన్‌లు, గాయాలపై వాడిన రక్తంతో తడిసిన కాటన్, బ్యాండెజ్‌లు వంటి వైద్య వ్యర్థాలను నిర్లక్ష్యంగా రోడ్డు పక్కనే పడేస్తున్నారు. ఈ ప్రాంతానికి ఆనుకుని ఉన్న పొలాల్లో రైతులు పని చేయడంతో పాటు గ్రామ ప్రజలు రాకపోకలు సాగిస్తుండటంతో తీవ్ర ఆందోళన వ్యక్తమవు తోంది. ఇలాంటి ప్రమాదకర వైద్య వ్యర్థాలు బయట పడేయడం వల్ల ప్రజలు, రైతులు ఏదైనా వింత రోగాల బారిన పడే ప్రమాదం ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఈ ఘటనపై అధికారులు వెంటనే స్పందించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకో వాలని మండల ప్రజలు, పక్కన ఉన్న రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఇకముందు ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కట్టుదిట్ట మైన చర్యలు తీసుకోవాలని వారు కోరుతు న్నారు.

# విద్యార్థులు.. ఉపాధ్యాయులైన వేళ!

## పంతులుపల్లి పాఠశాలలో చిన్నారుల స్వయం పరిపాలనా దినోత్సవం






**వేద న్యూస్, నల్లబెల్లి**

నల్లబెల్లి మండలం నాగరాజుపల్లి గ్రామ పరి ధిలోని పంతులుపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు ఉపాధ్యాయులైన వేళ స్వయం పరి పాలనా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకు న్నారు. పాఠశాల హెడ్‌మాస్టర్ కర్ణకంటి రాంమూర్తి, సహోపాధ్యాయులు కూనమళ్ల రాజన్ బాబు మార్గదర్శకత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు విభిన్న పదవుల్లో వ్యవహరించి పరిపాలనా అనుభవం పొందారు. పాఠశాల హెడ్‌మాస్టర్‌గా రాధారపు శివాని, సర్పంచ్‌గా ఎర్ర లాస్య, ఏఏపీసీ చైర్మన్‌గా బైరి ప్రసన్న, ఉపాధ్యాయు లుగా నేతునూరి వర్షిత, రాధారపు రుత్విక్ తేజ్ వ్యవహరించారు. చిన్నారులు పరిపా లనా వ్యవస్థల గురించి నేర్చుకుంటూ బాధ్యతలు నిర్వహిస్తూ ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ ఎరుకల లలిత, ఏఏపీసీ చైర్మన్ ఎరుకల వెంక టలక్ష్మి పాఠశాలను సందర్శించి చురుకుగా పాల్గొన్న చిన్నారులను అభినందించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, పరిపాలనా నైపుణ్యాలు పెంపొం దుతాయని అభిప్రాయపడ్డారు.

# ప్రేమ.. పెళ్లి.. ఆపై మర్డర్!

## యూట్యూబర్ వైష్ణవిని హత్య చేసిన భర్త

- మృతురాలు నాలుగు నెలల గర్భిణీ
- కోరుట్ల మండలం మాదాపూర్ దారుణం



**వేద న్యూస్, మెట్‌పల్లి ప్రతినిధి**

జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం మాదాపూర్ గ్రామంలో దారుణ ఘటన చోటుచేసుకుంది. యూట్యూబర్ వైష్ణవిని ఆమె భర్త హరిబాబు హత్య చేసిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. రెండు సంవ త్సరాల క్రితం ప్రేమ వివాహం చేసుకున్న ఈ దంపతుల మధ్య కొంతకాలంగా గొడవలు జరుగుతున్నట్లు సమాచారం. సోమవారం రాత్రి జరిగిన చిన్నపాటి వాగ్వాదం తీవ్రరూపం దాల్చడంతో, నాలుగు నెలల గర్భిణి అయిన వైష్ణవిని హరిబాబు కత్తితో పొడిచాడు. తీవ్ర గాయాలతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఘటన అనంతరం హరిబాబు పరారయ్యాడు. అనుమానం కారణంగానే ఈ హత్య జరిగిందని స్థానికులు అనుమాని స్తున్నారు. నిందితుడికి కఠిన శిక్ష విధించా లని వైష్ణవి కుటుంబ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

# కళ్లలో కారం చల్లి కోటి కొట్టేశారు..

**వేద న్యూస్, హైదరాబాద్**

హైదరాబాద్ కూకట్‌పల్లి ప్రాంతంలో కోటి రూపాయల నగదు దోపిడీ ఘటన కలకలం రేపింది. ద్విచక్ర వాహనంపై బాక్సులో నగదు తరలిస్తున్న ఇద్దరిపై దాడి చేసి గుర్తు తెలియని దుండగులు డబ్బును దోచుకుపో యారు. అయితే పోలీసుల వేగవంతమైన దర్యాప్తులో ఈ ఘటనలో బాధితుల్లో ఒకరే ప్రధాన కుట్రదారుడిగా ఉన్నట్లు బయటప డింది. పోలీసుల వివరాల ప్రకారం బహదూర్‌పురాకు చెందిన ఖుస్రోద్దీన్, అజీ ముద్దీన్ సోమవారం రాత్రి ద్విచక్ర వాహనంపై నగదు తీసుకెళ్తున్నారు. కూకట్‌పల్లి మెట్రో పిల్లర్ సంఖ్య ఎనిమిది వందల ముప్పై ఆరు వద్దకు చేరుకోగానే రెండు బైకులపై వచ్చిన నలుగురు దుండగులు వారిని అడ్డగించారు. అనంతరం వారి కళ్లలో కారం చల్లి వారి వద్ద ఉన్న కోటి రూపాయల నగదును లాక్కొని అక్కడి నుంచి పరారయ్యారు.

వేద న్యూస్

బుధవారం మార్చి 18, 2026

# భీమన్నను దర్శించుకున్న మంత్రి అడ్లూరి

– స్వామివారికి ప్రత్యేక పూజలు

**వేద న్యూస్, వేములవాడ ప్రతినిధి:**



వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి అనుబంధంగా ఉన్న భీమేశ్వర స్వామిని తెలంగాణ రాష్ట్ర మంత్రి, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంత్రి ఆలయానికి చేరుకున్న సందర్భంగా అర్చకులు, వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి కోడె మొక్కులు చెల్లించుకున్నారు. స్వామివారి మండపంలో అర్చకులు ఆశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ఏఈఓ జి. శ్రావణ్ కుమార్ మంత్రికి స్వామివారి శేషవస్త్రం, లడ్డు ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల ఏఎస్పీ చంద్రయ్య, వేములవాడ డీఎస్పీ శ్రీనివాస్, ఎమ్మార్వో జయంత్, ఆలయ పర్యవేక్షకులు జి. శ్రీనివాస్ శర్మ, ఎడ్ల శివసాయి, సిబ్బంది, వేద పండితులు పాల్గొన్నారు.

# అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

– గుడ్ టచ్-బ్యాడ్ టచ్‌పై విద్యార్థులకు అవగాహన సదస్సు

**వేద న్యూస్, చందుర్తి:**



రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి గితే సూచనల మేరకు జిల్లా షీ టీమ్ విద్యాసంస్థలు, మహిళలు పనిచేసే ప్రదేశాలను సందర్శిస్తూ గుడ్ టచ్-బ్యాడ్ టచ్, ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, పోక్సో చట్టం, మహిళా భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమంలో భాగంగా చందుర్తి మండలం లింగంపేటలోని మహోదయ ఇంగ్లీష్ మీడియం పాఠశాలను షీ టీమ్ బృందం మంగళవారం సందర్శించి విద్యార్థులకు అవగాహన కల్పించింది. వేధింపులకు గురైతే నిర్భయంగా షీ టీమ్ నెంబర్ 8712656425కు ఫిర్యాదు చేయాలని, నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచబడతాయని పేర్కొన్నారు. సోషల్ మీడియాలో అపరిచిత వ్యక్తులతో సంభాషణలు చేయకుండా, వ్యక్తిగత వివరాలు పంచుకోవద్దని విద్యార్థులకు సూచించారు.

# అభివృద్ధి పథంలో వేములవాడ

– సీసీ రోడ్డు పనులను పరిశీలించిన చైర్మన్ పుల్కం రాజు

**వేద న్యూస్, వేములవాడ ప్రతినిధి:**



వేములవాడ పట్టణంలో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా నాలుగో వార్డులో మహాలక్ష్మి కమాన్ నుంచి జమ్మిచెట్టు వరకు చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ పరిశీలనలో స్థానిక కౌన్సిలర్ తోట రాజు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ నాయకత్వంలో పట్టణ అభివృద్ధి వేగవంతమవుతోందని తెలిపారు. ప్రజల సౌకర్యార్థం వార్డుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు ఖచ్చితంగా పాటించాలని అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. పట్టణంలోని ప్రతి వార్డులో సమస్యలను గుర్తించి ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని, రాబోయే రోజుల్లో వేములవాడను ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దుతామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, కౌన్సిలర్ కొండ రాజశేఖర్, కాంగ్రెస్ నాయకులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థులకు అగ్ని ప్రమాదాలపై అవగాహన

**వేద న్యూస్, వేములవాడ ప్రతినిధి:**



ప్రజాపాలన 99 రోజుల కార్యక్రమంలో భాగంగా వేములవాడ ఫైర్ స్టేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అగ్ని ప్రమాదాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఫైర్ స్టేషన్ ఇన్‌చార్జి, ఫైర్ ఆఫీసర్ సిహెచ్ శంకర్ ఆధ్వర్యంలో వేములవాడ కిడ్స్ కాన్వెంట్ హైస్కూల్‌లో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఫైర్ సేఫ్టీ అధికారులు అగ్ని ప్రమాదాలు ఎలా జరుగుతాయి, ప్రమాద సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తక్షణ చర్యల గురించి విద్యార్థులకు వివరించారు. అగ్నిప్రమాదం జరిగినప్పుడు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వాలని సూచించారు. అలాగే ప్రమాదాలు నివారించేందుకు జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫైర్ ఆఫీసర్ సిహెచ్ శంకర్, దుర్గరాజ్, రాజేశ్వర్, శేఖర్, పీఈటీ చేకూర్తి నవీన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

**వేద న్యూస్, రుద్రూర్ :**



రుద్రూర్ మండలంలోని అక్బర్‌నగర్ గ్రామంలో మంగళవారం పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల శిబిరం నిర్వహించారు. ఇందులో 48 ఆవులు, గేదెలకు గాలికుంటు టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సీతారాంరాజు, పాడి రైతులు , పశు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ అమలు చేయాలి

– బిజెపి పట్టణ అధ్యక్షుడు కొలకాని రాజు డిమాండ్

**వేద న్యూస్, జమ్మికుంట:**



బిజెపి రాష్ట్ర పార్టీ ఆదేశాల ప్రకారం జమ్మికుంట పట్టణ అధ్యక్షులు కొలకాని రాజు ఆధ్వర్యంలో గాంధీ చౌరస్తా లో ధర్నా నిర్వహించి, బైక్ ర్యాలీగా తహశీల్దార్ ఆఫీస్ కి వెళ్లి కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను, స్థానిక ప్రజా సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షులు కొలకాని రాజు, మున్సిపల్ కౌన్సిలర్ శీలం శ్రీనివాస్, నాయకులు కనుమల్ల గణపతి మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాడి 27 నెలలు గడుస్తున్నా, ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీ ల్లో ఏ ఒక్క హామీని కూడా అమలు చేయడంలేదని చెప్పారు. మహాలక్ష్మి పథకం పేరుతో మహిళలకు నెలకు రూ.2500 , కళ్యాణలక్ష్మి తో పాటు తులం బంగారం, ఇంటర్ విద్యార్థినిలకీ స్కూటీ, రైతులకు రైతు భరోసా కింద సంవత్సరానికి రూ. 15000, నిరుపేదలకు ఇళ్ళ పట్టాలు, కొత్త పెన్షన్ మరియు పెన్షన్ రెండు వేల రూపాయలను నాలుగు వేలకు పెంచుతామని దొంగ హామీలు ఇచ్చి గద్దెనెక్కిన రేవంత్ రెడ్డి హామీలను నెరవేర్చడంలో విఫలం చెందారని విమర్శించారు. రేవంత్ రెడ్డి కి పరిపాలన చాతకావడం లేదని, వెంటనే ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు, కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కైలాసకొటి గణేష్, గుర్రం పరుశురాం, తుర్పాటి శంకర్, కొరె రవి, అప్పం మధు, మోతె స్వామి, రాకేష్ ఠాకూర్, తిరుపతి యాదవ్, రాచపల్లి ప్రశాంత్, శ్రీవర్తి ప్రవీణ్, అఖిల్, అడువాల శ్రీధర్, కేస స్వరూప, రాయబారపు సురేష్, ఆకుల పోచయ్య, తిరుపతి, మేడిపల్లి మహేష్, యాంసాని సమ్మయ్య, మురికి మహేష్, సిరియాల విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ గ్యారంటీలపై వేములవాడలో బీజేపీ పోరు



**వేద న్యూస్, వేములవాడ ప్రతినిధి:**

– తహసీల్దార్‌కు వినతిపత్రం

– ఎంఐఎం దిష్టిబొమ్మ దహనం

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో విఫలమైందని వేములవాడ పట్టణ బీజేపీ నాయకులు విమర్శించారు. మంగళవారం గ్యారంటీలను తక్షణమే అమలు చేయాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయం వద్ద వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హామీలు అమలు చేయకపోతే సహించబోమని హెచ్చరించారు. అనంతరం అసెంబ్లీలో వందేమాతరం గీతాన్ని అవమానించినట్లు ఆరోపిస్తూ ఎంఐఎం పార్టీపై ఆగ్రహం వ్యక్తం చేసిన బీజేపీ నాయకులు ఆ పార్టీ దిష్టిబొమ్మను దహనం చేశారు. దేశంలో నివసించే ప్రతి ఒక్కరూ జాతీయ గీతాలు, వందేమాతరం గీతాన్ని గౌరవించాల్సిందేనని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు రాపెల్లి శ్రీధర్, బీజేపీ రాష్ట్ర నాయకులు ప్రతాప రామకృష్ణ, రేగుల మల్లికార్జున్, కౌన్సిలర్లు కొండ్లెపు ముత్యం, మైలారం శ్రీనివాస్, వంగల శ్రీనివాస్, రేగుల శ్రీకాంత్, బోనాల శివ, మామిండ్ల లక్ష్మీరాజం, రేగుల రాజ్‌కుమార్, బిల్ల కృష్ణ, గుడిసె మనోజ్ కుమార్, వివేక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బోయినిపల్లిలో రైతులకు శిక్షణ కార్యక్రమం

– సహజ వ్యవసాయం, నూనె తాటి సాగుపై అవగాహన

**వేద న్యూస్, బోయినిపల్లి:**



బోయినిపల్లి మండలంలోని రైతు వేదికలో ఏటిఏంఏ ఆధ్వర్యంలో 30 మంది రైతులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సహజ వ్యవసాయం, నూనె తాటి సాగు, పాడి పశువుల పెంపకం, పాల ఉత్పత్తి పెంపు వంటి అంశాలపై అవగాహన కల్పించారు. యూరియా వినియోగాన్ని తగ్గించి సమతుల్య ఎరువుల వినియోగంపై రైతులకు సూచనలు ఇచ్చారు. వ్యవసాయంలో కొత్త పద్ధతులు అవలంబించడం ద్వారా ఖర్చులు తగ్గించుకోవడం, మెరుగైన దిగుబడులు సాధించడం గురించి వివరించారు. అలాగే ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పశువైద్య అధికారి సతీష్ మాట్లాడుతూ పశువుల మేలు రకాలు, పశుగ్రాసం, పాల ఉత్పత్తి పెంపు, వ్యాధుల నివారణపై వివరించారు. మండల వ్యవసాయ అధికారి ప్రణీత రైతులకు జిప్సం, ట్రైకోడర్మా, భస్వరాన్ని కరిగించే ఎరువులు, కూరగాయల విత్తనాలు వంటి రాయితీ పథకాల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బోయినిపల్లి సర్పంచ్ నల్ల మోహన్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోయిని ఏల్లేష్, సెస్ డైరెక్టర్ కొట్టేపల్లి సుధాకర్, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# ప్రతి ప్రయాణం సురక్షిత గమ్యం చేరాలి

– ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం

**వేద న్యూస్,సూర్యాపేట :**




ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో సూర్యాపేట పట్టణంలో గల సిఎంఆర్ షాపింగ్ మాల్ ఉద్యోగులకు రోడ్డు నియమాల పట్ల పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం అవగాహన కార్యక్రమం నిర్వహించారు.రోడ్డు భద్రత ప్రమాదాల నివారణకు సంబంధించిన సూచనలు చేశారు.రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న 99 రోజుల ప్రణాళిక కార్యక్రమంలో భద్రతా అంశాల గురించి పోలీస్ శాఖ వివరించడం జరుగుతుందని ఎస్సై తెలిపారు.దీనిలో భాగంగానే రోడ్ భద్రత పట్ల అవగాహన కార్యక్రమాల ద్వారా వాహనదారులను ప్రజలను చైతన్యవంతం చేస్తున్నామని అన్నారు. ప్రమాదాల నివారణకు అవగాహన నియమాలు పాటించడమే ప్రధాన మార్గమని అన్నారు. ద్విచక్ర వాహనంపై ప్రయాణించేటప్పుడు హెల్మెట్ ధరించాలని తప్పుడు మార్గంలో వాహనాలు నడపకూడదని ఎక్కడపడితే అక్కడ రోడ్లు దాటకూడదని కోరారు.

# ఫకీర్ కొండాపూర్ పాఠశాలలో ఘనంగా వీడ్కోలు కార్యక్రమం

**వేద న్యూస్, ఇబ్రహీంపట్నం:**




ఇబ్రహీంపట్నం మండలం ఫకీర్ కొండాపూర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఏడవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉల్లాసంగా, ఉత్సాహంగా చేసిన నృత్య ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తోట రమేష్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువులో రాణించాలని సూచించారు. పై చదువుల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లే విద్యార్థులు తమ గ్రామానికి, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, ముఖ్యంగా విద్యార్థినులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు రేణుక, ఉప సర్పంచ్ గుంటి పుష్ప, మాజీ ఎస్ఎంసీ చైర్మన్ సింగని మారుతి, వివో దీప, కారోబార్ గంగారం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వేద న్యూస్

బుధవారం మార్చి 18, 2026

# ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలి

**వేద న్యూస్, రుద్రూర్ :**

బీజేపీ రాష్ట్ర, జిల్లా పార్టీ ఆదేశాల మేరకు భారతీయ జనతా పార్టీ రుద్రూర్ మండల అధ్యక్షులు ఆలపాటి హరికృష్ణ ఆధ్వర్యంలో సహించదు తెలంగాణ కార్యక్రమంలో భాగంలో రాష్ట్ర ప్రభుత్వం అనగా కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా ప్రజలకు ఇచ్చిన 6 గ్యారెంటీలను అమలు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నందున, ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని మంగళవారం రుద్రూర్ మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయంలో బీజేపి నాయకులు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ప్రచారంలో ప్రజలకు హామీలను ఇచ్చి హామీలను నెరవేర్చకుండా నిర్లక్ష్యం వహిస్తుందని పేర్కొన్నారు. ఇష్టానుసారంగా రాష్ట్రంలో రాక్షస పాలన చేస్తూ రైతులను మోసం చేస్తూ, రైతు నడ్డి విడిచి, సాధ్యం కానీ హామీలు ఇచ్చి గద్దెనెక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో బాన్సువాడ నియోజకవర్గం బీజేపీ నాయకులు ఎన్ ఆర్ ఐ కోనేరు శశాంక్, జిల్లా కౌన్సిల్ మెంబర్ గుండూరు ప్రశాంత్ గౌడ్, మండల సీనియర్ నాయకులు కటిక రామరాజు, ఏముల గజేందర్, పార్వతి మురళి, బీవీ గుప్తా, బేగరి వినోద్ కుమార్, కేవీడీ



సాయిలు, గుడిసె ప్రభాకర్, ధర్మవరం వెంకటేష్, బోజిగొండ అనిల్, శానంబాలాజీ, కృష్ణంరాజు, ఎర్రోళ్ల గంగాధర్, ఈశ్వర్, తెల్లరవి, పోశెట్టి, గోపి, చిన్న సాయిలు, శేఖర్, నడిపి రాజేష్, గంగులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మాతృభాషపై మక్కువ పెంపొందించాలి

**- డీఈవో కె. రాము**

**వేద న్యూస్, మెట్‌పల్లి ప్రతినిధి:**



మెట్‌పల్లి డివిజన్ స్థాయి తెలుగు ప్రతిభా పరీక్షలను తెలుగు ఫోరం డివిజన్ అధ్యక్షుడు సొప్పరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జగిత్యాల జిల్లా విద్యాధికారి కె. రాము ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ.. మాతృభాషపై పట్టు ఉంటే విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించగలరని తెలిపారు. నాణ్యమైన విద్యతో పాటు భాషా నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. దేశ భాషలందు తెలుగు లెస్స అన్నట్లుగా తెలుగు భాష ఔన్నత్యాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఈ పరీక్షల్లో డివిజన్ పరిధిలోని సుమారు 50 పాఠశాలల నుంచి 100 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు నగదు పురస్కారాలు అందజేశారు. పాల్గొన్న ప్రతి విద్యార్థికి ప్రశంసా పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు, ఉపాధ్యాయులు, తెలుగు ఫోరం సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు

# ఎండిపోతున్న పంటలకు అందిన నీరు

**- సర్పంచ్ జోక్యంతో కాలువ ద్వారా నీటి విడుదల**

**వేద న్యూస్, కోనరావుపేట:**



రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం మల్కపేట గ్రామంలో సాగునీరు అందక ఎండిపోతున్న పంటలకు ఉపశమనం లభించింది. రిజర్వాయర్‌కు సమీపంలో ఉన్నప్పటికీ పంట పొలాలకు నీరు అందక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైతుల సమస్యను గ్రామ సర్పంచ్ బోయిని దేవరాజు దృష్టికి తీసుకురాగా ఆయన వెంటనే స్పందిం చారు. జిల్లా ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి పరిస్థితిని వివరించడంతో అధికారులు సానుకూలంగా స్పందించారు. అనంతరం కాలువ ద్వారా రిజర్వాయర్ కింద ఉన్న పొలాలకు నీటిని విడుదల చేశారు. సకాలంలో నీరు అందడంతో ఎండిపోతున్న పంటలకు జీవం పోసినట్లయిందని రైతులు ఆనందం వ్యక్తం చేశారు. తమ సమస్యను పరిష్కరించిన సర్పంచ్ దేవరాజుకు కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు

**వేద న్యూస్, బోయినిపల్లి:**



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం విలాసాగర్ గ్రామంలోని రైతు వేదికలో ప్రకృతి వ్యవసాయం పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమం గ్రామ సర్పంచ్ ఏనుగుల కనకయ్య, ఉప సర్పంచ్ పొత్తూరి శైలజ రాజు ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా నిపుణులు రైతులకు ప్రకృతి వ్యవసాయం ప్రాముఖ్యత, రసాయన రహిత సాగు విధానాలు, తక్కువ ఖర్చుతో అధిక లాభాలు పొందే పద్ధతులపై వివరించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా భూమి సారవంతం పెరిగి ఆరోగ్యకరమైన పంటలు పండుతాయని తెలిపారు. రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఏనుగుల కనకయ్య, ఉపసర్పంచ్ పొత్తూరి శైలజ రాజు, వార్డు సభ్యులు గోల్కొండ సూరి, కొంకటి సతీష్, దయ్యాల రేణుక, దమ్మ వెంకట రమణ, జోగు శంకర్, గంగాధర శ్రీకాంత్, సుంకపాక అనిల్, మండల వ్యవసాయాధికారి ప్రణీత, ఏఈవో రజిత, గ్రామస్తులు పాల్గొన్నారు.

# రైస్ మిల్లర్ల బకాయిలు రూ.165 కోట్లు!

**- చర్యలు ఇంకెప్పుడు?**

**- అధికారుల మౌనం పై విమర్శలు**

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**



రాజన్న సిరిసిల్ల జిల్లాలో రైస్ మిల్లర్ల నుంచి ప్రభుత్వానికి రావాల్సిన బకాయిలు సుమారు రూ.165 కోట్లుగా ఉన్నట్లు సమాచారం. ప్రతి సీజన్‌లో ప్రభుత్వం రైతుల నుంచి కొనుగోలు చేసిన వరి ధాన్యాన్ని రైస్ మిల్లర్లకు ఇచ్చి, వాటిని బియ్యంగా మార్చి తిరిగి ప్రభుత్వానికి అందించాల్సి ఉంటుంది. ఆ బియ్యాన్ని పేదలకు రేషన్ షాపుల ద్వారా పంపిణీ చేస్తారు. అయితే 2024-25 సీజన్‌కు సంబంధించిన వరి ధాన్యాన్ని జిల్లాలోని సుమారు 40 మంది రైస్ మిల్లర్లు పూర్తిగా ప్రభుత్వానికి అందించకుండా పక్కదారి పట్టించారని ఆరోపణలు విని



స్తున్నాయి. దీనివల్ల భారీగా రూ.165 కోట్ల మేర బకాయిలు నిలిచిపోయినట్లు తెలుస్తోంది. ఈ విషయంలో జిల్లా అధికారులు ఇప్పటివరకు కఠిన చర్యలు చేపట్టలేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పక్క జిల్లాలైన జగిత్యాల, నిజామాబాద్, పెద్దపల్లి, కరీంనగర్‌లలో ఇలాంటి కేసుల్లో మిల్లర్లపై కేసులు నమోదు చేసి ఆస్తులు సీజ్ చేస్తున్నప్పటికీ, సిరిసిల్ల జిల్లాలో మాత్రం చర్యలు ఆలస్యం అవుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. ఇదిలా ఉండగా సంబంధిత రైస్ మిల్లర్లు చట్టపరమైన రక్షణ కోసం కోర్టులను ఆశ్రయించే ప్రయత్నంలో ఉన్నారని సమాచారం. ఈ నేపథ్యంలో అధికారులు త్వరితగతిన చర్యలు తీసుకుని ప్రభుత్వానికి నష్టం కలగకుండా చూడాలని ప్రజలు, సామాజికవేత్తలు కోరుతున్నారు.

# 100 శాతం పన్నులు వసూలు చేయాలి

**- పారిశుధ్య పనులు పకడ్బందీగా నిర్వహించాలి**

**- కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ పరిధిలో ఇంటి, భవనాల పన్నులను 100 శాతం వసూలు చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ)లో మంగళవారం మున్సిపల్ కమిషనర్లు, అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో పన్నుల వసూళ్లు, పారిశుధ్యం, నీటి సరఫరా, బడ్జెట్ అంశాలపై చర్చించారు. సిరిసిల్లలో రూ.6.99 కోట్ల లక్ష్యానికి గాను రూ.5.66 కోట్లు, వేములవాడలో రూ.4.54 కోట్ల లక్ష్యానికి గాను రూ.3.18 కోట్లు వసూలయ్యాయని అధికారులు తెలిపారు. లక్ష్యాలను పూర్తి చేసి 15వ ఆర్థిక సంఘం నిధులు పొందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. మున్సిపాలిటీల్లో నీటి సరఫరా అంతరాయం లేకుండా చూడాలని, బోర్ల మరమ్మత్తులు, పైప్‌లైన్ లీకేజీల నివారణపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. పబ్లిక్ టాయిలెట్లు, పార్కుల నిర్వహణను మెరుగుపరచాలని, చెత్త వేర్వేరుగా సేకరణ (తడి, పొడి)పై ప్రజల్లో అవగాహన పెంచాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా ఆడిట్ అధికారి శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా, సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# ఇఫ్తార్ విందు ఏర్పాటు

**వేద న్యూస్, రుద్రూర్ :**



బాన్సువాడ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఇందూర్ చంద్ర శేఖర్ ఆధ్వర్యంలో మంగళవారం రుద్రూర్ గ్రామంలోని పెద్ద మజీద్ లో మైనారిటీ సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ ఇఫ్తార్ విందులో ముఖ్య అతిథిగా ఉర్దూ అకాడమీ చైర్మన్ తహెర్ బిన్ హందాన్ పాల్గొని ఒకరినొకరు పండ్లు తినిపించుకున్నారు. ఈ కార్యక్రమం లో మండల కాంగ్రెస్ నాయకులు కర్కా అశోక్, ఉప సర్పంచ్ షేక్ నిస్సర్, గౌస్ ,అడప సాయిలు, పట్ల సురేష్, నరేష్, పార్వతి ప్రవీణ్, రాజు, సాయి లక్ష్మణ్, గొల్ల పవన్, మైనారిటీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# డీటీఎఫ్ సర్వసభ్య సమావేశం





**వేద న్యూస్, చొప్పదండి:**

చొప్పదండి మండల విద్యా వనరుల కేంద్రంలో డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైద్యుల రాజిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విద్యారంగ సమస్యలపై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలు, సరెండర్ లీవ్, జీపీఎఫ్ పార్ట్ ఫైనల్ నిధులను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. నిరుద్యోగ సమస్య పరిష్కారం కోసం డీఎస్సీ నిర్వహించాలని, అర్హత గల ఉపాధ్యాయులకు ప్రమోషన్లు కల్పించాలని సూచించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి చకినాల రామ్మోహన్ మాట్లాడుతూ.. పదవీ విరమణ వయస్సు పెంపు నిర్ణయాన్ని ప్రభుత్వం పునఃపరిశీలించాలని కోరారు. రాష్ట్ర పూర్వ ఆడిట్ కమిటీ కన్వీనర్ దామెర యేసు రెడ్డి సంఘ బలోపేతానికి ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం డీటీఎఫ్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గుర్రం శ్రీనివాసరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఉత్కం వేణుగోపాల్, ఉపాధ్యక్షులుగా ఒప్పుల కరుణాకర్, గట్టు జయ, కార్యదర్శులుగా సంకనభట్ల సురేందర్, జీ. వీరేశం, ఏ. హరి లీల ఎన్నికయ్యారు. ఎన్నికల పరిశీలకులుగా కనిగంటి రాజమౌళి, ఎన్నికల అధికారిగా సముద్రాల అంజయ్య వ్యవహరించారు. సమావేశంలో జిల్లా, రాష్ట్ర నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# కరెంటు షాక్ తో గేదె మృతి

**వేద న్యూస్, మందమర్రి :**



కరెంటు షాక్ తో గేదె మృతి చెందిన ఘటనమందమర్రి మండలం లోని సారంగపల్లి గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన బుర్ర శ్రావణ్ స్వయం ఉపాధి కోసం గేదెలను పోషిస్తూ కుటుంబాన్ని పోషించు కుంటున్నాడు. ఈ తరుణంలో ప్రమాదవశాత్తు ట్రాన్స్ఫార్మర్ కు గేదె తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. గేదె విలువ లక్ష రూపాయల పై చిలుకు ఉంటుందని రైతు తెలిపాడు. పాడి పశువులను పోషిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నానని గేదె మృతి చెందడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని ప్రభుత్వం తనను ఆదుకోవాలని ఆయన కోరారు.

వేద న్యూస్
బుధవారం మార్చి 18, 2026

## బ్రిడ్జి పరిసర ప్రాంతాలలో చెత్తాచెదారాన్ని తొలగింపు



**వేద న్యూస్, మందమర్రి :**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మందమర్రి మున్సిపల్ కార్యాలయ పారిశుద్ధ్య సిబ్బందితో మున్సిపల్ కమిషన ర్ తుంగపిండి రాజలింగు రామన్ కాలనీ వద్ద ఉన్న రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి, ఫుట్ ఓవర్ బ్రిడ్జి పరిసర ప్రాంతాలలో శుభ్రత కార్యక్రమా ని నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రిడ్జి పరిసర ప్రాంతాలలో దుమ్ము, దూళి తో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని శుభ్రం చేయించారు . ఈ కార్యక్రమంలో ఎన్విరా న్ మెంటల్ ఇంజనీర్ ఏం గోపికృష్ణ, ఇన్చార్జి జవాన్ మేకల నరేష్, ఇతర మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు

## గ్రామ సమాఖ్య భవనం పనులు త్వరగా పూర్తి చేయాలి

- కలెక్టర్ గరిమ అగ్రవాల్



**వేద న్యూస్, ఇల్లంతకుంట:**

ఇల్లంతకుంట మండలం ముస్కానిపేట గ్రామంలో గ్రామ సమాఖ్య భవన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. మంగళవారం భవన నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్ పనుల పురోగతిపై అధికారులను ప్రశ్నించారు. ఈ సందర్భంగా అవసరమైన కార్మికులు, నిర్మాణ సామగ్రిని సమకూర్చుకుని పనుల్లో వేగం పెంచాలని సూచించారు. మండలంలో మంజూరైన అంగన్వాడీ కేంద్రాల నిర్మాణాలను పూర్తి చేసి అన్ని వసతులు కల్పించాలని ఆదేశించారు. టాయిలెట్ల నిర్మాణాలను కూడా నిర్ణీత గడువులో పూర్తి చేయాలని చెప్పారు. జనగణనలో భాగంగా ఇండ్ల గణన ప్రక్రియపై ఎంపీడీఓను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఫరూఖ్, ఎంపీడీఓ శశికళ తదితరులు పాల్గొన్నారు

## గ్రామంలో మద్యం, గుట్కా అమ్మకాలు నిషేధం

- కందికట్కూర్ గ్రామసభలో ఏకగ్రీవ తీర్మానం



**వేద న్యూస్, ఇల్లంతకుంట:**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం కందికట్కూర్ గ్రామంలో మద్యం, గుట్కా అమ్మకాలను పూర్తిగా నిషేధిస్తూ గ్రామ పంచాయతీ ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. సర్పంచ్ విజయమ్మ అధ్యక్షతన నిర్వహించిన గ్రామసభలో ఈ నిర్ణయం తీసుకున్నారు. గ్రామంలో వ్యసనాల వల్ల కుటుంబాలు ఆర్థికంగా, ఆరోగ్యపరంగా నష్టపోతున్న నేపథ్యంలో ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. గ్రామంలో శాంతిభద్రతలు నెలకొనడంతో పాటు యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండేందుకు ఇది దోహదపడుతుందని పేర్కొన్నారు. ఇకపై గ్రామంలో మద్యం దుకాణాలు, గుట్కా విక్రయాలను అనుమతించకూడదని నిర్ణయించారు. వ్యసనాలకు ఖర్చు చేసే డబ్బును కుటుంబ అవసరాలు, పిల్లల విద్య కోసం వినియోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దొమ్మాటి అజయ్, మాజీ ఎంపీటీసీ దొమ్మాటి కిషోర్ గౌడ్, వార్డు సభ్యులు, గ్రామ పంచాయతీ కార్యదర్శి రంజిత్, మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ హామీలు వెంటనే అమలు చేయాలి

- తహసీల్దార్‌కు బీజేపీ వినతి పత్రం




**వేద న్యూస్, నల్లబెల్లి:**

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ నాయకులు నల్లబెల్లి మండల తహసీల్దార్ ముప్పు కృష్ణకు వినతిపత్రం సమర్పించారు. బీజేపీ మండల అధ్యక్షుడు తడుక వినయ్ గౌడ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వినయ్ గౌడ్ మాట్లాడుతూ.. ఎన్నికల హామీలైన జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి, వృద్ధాప్య, వితంతు, దివ్యాంగుల పెన్షన్లు, కల్యాణ లక్ష్మి, పేదలకు గృహ నిర్మాణ పథకం, రైతు భరోసా తదితరాలు ఇప్పటికీ అమలు కాలేదని విమర్శించారు. రైతులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొం టున్నారని, భరోసా సకాలంలో అందక అప్పులపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. హామీలు వెంటనే అమలు చేయకపోతే బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రంగాపురం సర్పంచ్ ఓరుగంటి మాధురి, జిల్లా కౌన్సిల్ సభ్యుడు బొద్దిరెడ్డి ప్రతాప్ రెడ్డి, మండల నాయకులు ఈర్ల నాగరాజు, బత్తిని కుమారస్వామి, సింగిరెడ్డి యాదగిరి, ఓదెల అశోక్, మురికి మనోహర్, వల్లే పర్వాతలు, బోట్ల ప్రతాప్, కొండ్లె రమేష్, ధర్మారం క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## విలేఖరి కుటుంబానికి పరామర్శ



**వేద న్యూస్, వనపర్తి:**

వనపర్తి జిల్లా గోపాల్పేట మండలానికి చెందిన విలేఖరి, అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు డా. సతీష్ యాదవ్ తన సహచరులతో కలిసి జయచంద్రుడి ఇంటికి వెళ్లి కుటుంబాన్ని పరామర్శించారు. జయచంద్రుడి తల్లి మృతి చెందిన సమయంలో అందుబాటులో లేకపోవడంతో మంగళవారం ప్రత్యేకంగా వెళ్లి సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె లేని లోటును ఎవ్వరూ తీర్చలేరని, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. చిన్నప్పటి నుంచి కలిసి పెరిగిన స్నేహితుడిగా వారి కుటుంబంతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పోలికపాడు సర్పంచ్ బంగారయ్య, బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థి మైబుస్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొంకి రమేష్, కాంగ్రెస్ నాయకుడు వెంకటేశ్వర్లు, బీజేపీ నాయకులు రాజనగరం రవి, ప్రసాద్, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల పోరాటానికి జాగృతి మద్దతు

- ప్రభుత్వం వెంటనే జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి
- మంత్రులు జర్నలిస్టులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలి
- జాగృతి రాష్ట్ర కార్యదర్శి భానోత్ కిసాన్ నాయక్



**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి :**

ఇండ్ల స్థలాల కోసమై గత రెండు రోజులుగా జర్నలిస్టులు చేస్తున్న పోరాటానికి మద్దతు పలుకుతూ, జర్నలిస్టులకు వెంటనే ఇళ్ల స్థలాలు కేటాయించాలని జాగృతి రాష్ట్ర కార్యదర్శి కిషన్ నాయక్, జాగృతి జిల్లా అధ్యక్షురాలు గట్టు కరుణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఖమ్మం ప్రెస్ క్లబ్లో సోమవారం నుండి గత రెండు రోజులుగా ఇళ్ల స్థలాల సాధనకు జర్నలిస్టులు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా జర్నలిస్టులను ఉద్దేశించి మాట్లాడుతూ... జర్నలిస్టులకు ప్రభుత్వం వెంటనే ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. గత పాలకులు జర్నలిస్టులకోసం కేటాయించిన 23.02 ఎకరాల భూమిని కేటాయించారని, ప్రస్తుత పాలకులు వారిచ్చిన హామీ మేరకు వెంటనే ఇండ్ల స్థలాలను జర్నలిస్టులకు అప్పగించాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులకు గత రెండు సంవత్సరాలుగా అక్రిడిటేషన్ కార్డులు కూడా మంజూరు చేయక ఇబ్బంది పడుతున్నారని, డిజిటల్ మీడియా, కేబుల్ ఛానల్స్, పిడిఎఫ్ పత్రికలకు కూడా అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లోనే జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి తక్షణమే పరిష్కరించే దిశగా కృషి చేయాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల ఇండ్ల స్థలాల సమస్యను పరిష్కరించకపోతే జాగృతి ఆధ్వర్యంలో ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జాగృతి జిల్లా కార్యదర్శి వనం నాగేందర్ బంజారా జాగృతి జిల్లా అధ్యక్షులు జి రాజ్ కుమార్ నాయక్, యువజన సంఘ నాయకులు ఎస్.కె ఆరిఫ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యకు 30 శాతం నిధులు కేటాయించాలి

- కొఠారి కమిషన్ నివేదిక ప్రకారం
- బిఎస్పి మండల ప్రధాన కార్యదర్శి బొడ్డు బాబురావు




**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి :**

ఈ నెల 20 న ప్రవేశపెట్టనున్న రాష్ట్ర బడ్జెట్ లో కొఠారి కమిషన్ నివేదిక ప్రకారం విద్యకు 30 శాతం నిధులు కేటాయించాలని బీఎస్పీ మండల ప్రధాన కార్యదర్శి బొడ్డు బాబురావు కోరారు. అధికారంలోకి వస్తే విద్యారంగంలో మార్పులు తెస్తామని చెప్పిన కాంగ్రెస్ ఇప్పుడు సవతి తల్లి ప్రేమ చూపిస్తుందని అన్నారు. గతంలో ఏడు శాతం మాత్రమే నిదులు కేటాయించిందని అవి కూడా పూర్తిస్థాయిలో విడుదల చేయలేదని అన్నారు. విద్య సమాజాభివృద్ధికి దోహదపడినా తగిన నిధులు కేటాయించడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి పాల్గొంటున్న ప్రతి కార్యక్రమంలో పేదలకు నాణ్యమైన విద్య, వైద్యం అందిస్తామని ప్రగల్భాలు పలుకుతున్నారనీ, కాని క్షేత్రస్థాయిలో సరైన మౌలిక వసతులు లేక ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, యూనివర్సిటీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని అన్నారు. పేద, మధ్య తరగతి విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకుంటే తమని ప్రశ్నించటం ప్రారంభిస్తారని తద్వారా తమ ఉనికిని కోల్పోవాల్సి వస్తుందని నాయకులు విద్యావ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్నారని పేర్కొన్నారు. ప్రతి మండలానికి కనీసం ఐదు తెలంగాణ పబ్లిక్ పాఠశాలలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

**టీచింగ్ పోస్టులు భర్తీ చేయాలి**

రాష్ట్రంలో సుమారు 18 వేలకు పైగా టీచర్ పోస్టులు, 80 శాతానికి పైగా యూనివర్సిటీలల్లో టీచింగ్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఏడాదిలో రెండు లక్షలు ఉద్యోగాలు ఇస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. వెంటనే జాబ్ క్యాలెండర్ విడుదల చేసి ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని కోరారు. అదేవిధంగా రాష్ట్రంలో పెండింగులో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్స్, స్కాలర్షిప్లను విడుదల చేస్తూ పెంచిన ఫీజులను ఉపసంహరించుకోవాలని కోరారు.

## ఆయిల్ పామ్ తో అధిక లాభాలు

- సాగుకు రైతులు ముందుకు రావాలి
- కలెక్టర్ గరిమ అగ్రవాల్
- మండలాల్లో 40 ఎకరాల్లో మెగా ప్లాంటేషన్ ప్రారంభం



**వేద న్యూస్, ఇల్లంతకుంట:**

ఆయిల్ పామ్ సాగు ద్వారా రైతులు అధిక లాభాలు పొందవచ్చని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఇల్లంతకుంట మండలం వంతడుపుల గ్రామంలో నిర్వహించిన మెగా ఆయిల్ పామ్ ప్లాంటేషన్ కార్యక్రమాన్ని మంగళవారం ఆమె ప్రారంభించారు. జిల్లాలోని పలు మండలాల్లో మొత్తం 40 ఎకరాల్లో ఆయిల్ పామ్ మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఆయిల్ పామ్ పంటతో పాటు అంతర పంటలుగా కూరగాయలు, మొక్కజొన్న, పూల మొక్కలు సాగు చేయవచ్చని చెప్పారు. డ్రిప్ ఇరిగేషన్ వంటి సబ్సిడీలు అందుబాటులో ఉండడంతో పాటు పంటకు మంచి మద్దతు ధర లభిస్తుందని వివరించారు. పంట కొనుగోలులో ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, ప్రతి మండలం నుంచి సేకరణ జరుగుతుందని తెలిపారు. ఒకే పంటపై ఆధారపడకుండా ఆయిల్ పామ్ సాగు వైపు రైతులు మళ్లాలని పిలుపునిచ్చారు. జిల్లా సమీపంలోనే సిద్ధిపేట జిల్లా నర్మెట్టలో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ఈ నెల 22న ప్రారంభం కానుందని వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం, ఉద్యానవన శాఖ అధికారి శరత్ బాబు, తహసీల్దార్ ఫరూఖ్, ఎంపీడీఓ శశికళ తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ పరిసరాల్లో పారిశుధ్య పనులు



**వేద న్యూస్, దేవరకద్ర**

అమరచింత మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ ఆంజనేయ స్వామి ఆలయ మైదానం, కట్ట సమీపంలో ఉన్న ముళ్లకంప గడ్డి మొక్కలను మంగళవారం తొలగించారు. రాబోయే ఉగాది పండుగను పురస్కరించుకుని ఆలయ పరిసరాలను శుభ్రపరిచే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమాన్ని మున్సిపాలిటీ చైర్మన్ జింక సువ ర్ణ రవి యాదవ్, వైస్ చైర్మన్ జి. రాధా అరుణ్ కుమార్ ప్రారంభించారు. ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కేజీ మహేందర్ రెడ్డి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు జయప్రకాష్, శరత్ తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేద ముస్లింలకు తోఫా పంపిణీ



**వేద న్యూస్, నర్వ:**

నర్వ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో నిరుపేద ముస్లిం సోదరులకు రంజాన్ సందర్భంగా బట్టల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపట్టారు. మండల తహసీల్దార్ మల్లారెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీసం చెన్నయ్య సాగర్, సర్పంచ్ హనుమంత్ రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ డి. కృష్ణారెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారులకు రంజాన్ తోఫా బట్టలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు, మండల నాయకులు, వివిధ గ్రామాల సర్పంచులు, పార్టీ అధ్యక్షులు, మైనారిటీ సోదరులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

- మండలంలో బీజేపీ నిరసన
- తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పణ

**వేద న్యూస్, దేవరకద్ర:**



దేవరకద్ర మండలంలో మంగళవారం బీజేపీ నాయకులు నిరసన కార్యక్రమం నిర్వహించి తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు కే. కృష్ణంరాజు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలు, అనేక హామీలు ఇప్పటివరకు అమలు కాలేదని విమర్శించారు. యువతకు జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి, దివ్యాంగులు, వృద్ధులు, వితంతువులకు పెన్షన్లు, కల్యాణ లక్ష్మి, పేదలకు గృహ నిర్మాణ పథకం, రైతులకు రైతు భరోసా, భూ సమస్యల పరిష్కారం వంటి హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆసరా పెన్షన్లు అర్హులకు అందడం లేదని, గృహ నిర్మాణ పథకాన్ని వేగవంతం చేయాలని కోరారు. అలాగే ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాల జారీలో జాప్యం జరుగుతోందని, వాటిని సకాలంలో అందించాలని అధికారులను కోరారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. అనంతరం 'ప్రధానమంత్రి సంసద్ ఖేల్ మహోత్సవ్' పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కొత్తకాపు నారాయణ రెడ్డి, శేఖర్, సత్యనారాయణ, కొండ నాగిరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి అనిల్, బాలగౌడ్, సమీర్, విష్ణువర్ధన్ రెడ్డి, తాటికొండ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## సీనియర్ జర్నలిస్ట్ ఆంజనేయులుకు టీఎస్జేయూ నేతల పరామర్శ

**వేద న్యూస్, జనగామ :**



జనగామ జిల్లా లింగాలఘణపురం మండలం వడ్డిచర్లకు చెందిన సీనియర్ జర్నలిస్ట్ చిటుకుల ఆంజనేయులు ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయపడి చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న తెలంగాణ జర్నలిస్ట్స్ యూనియన్ (టీఎస్‌జేయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోకల అనిల్, వరంగల్ జిల్లా ఉపాధ్యక్షులు ఈద శ్రీనాథ్ ఆయనను పరామర్శించారు. మంగళవారం ఆంజనేయులు స్వగ్రామమైన వడ్డిచర్లకు చేరుకున్న వారు ఆయన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని కల్పించారు. వారి వెంట టీఎస్‌జేయూ జనగామ జిల్లా అధ్యక్షుడు ఉప్పలంచి నరేందర్, ప్రధాన కార్యదర్శి గన్ను కార్తీక్, కోశాధికారి కొన్నె ఉపేందర్, కార్యనిర్వహణ కార్యదర్శి కౌశిక్, సహాయ కార్యదర్శి గండి ప్రవీణ్, కార్యవర్గ సభ్యులు ఆఫ్రోజ్ తదితరులు ఉన్నారు.

## భూ కబ్జాదారుల నుంచి రక్షించండి

- బాధితురాలి వినతి
- దాడి ఘటనపై పోలీసులకు ఫిర్యాదు

**వేద న్యూస్, జడ్చర్ల:**



జడ్చర్ల మండలం శిఖర్ గానిపల్లి గ్రామంలో భూ వివాదం నేపథ్యంలో మహిళపై దాడి జరిగిన ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మండ్ల వెంకటమ్మ తన పొలంలో ఉన్న పైప్‌లైన్‌ను ధ్వంసం చేసి తనపై దాడి చేశారని ఆరోపిస్తూ జడ్చర్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తమకు సర్వే నంబర్ 908లో 2 ఎకరాలు 9 గుంటలు, 909లో 2 ఎకరాలు 14 గుంటల భూమి ఉందని, ఈ భూమిపై గత కొన్ని సంవత్సరాలుగా వివాదాలు కొనసాగుతున్నాయని తెలిపారు. భూమిని కబ్జా చేసేందుకు కొందరు ఉద్దేశపూర్వకంగా దాడులకు పాల్పడుతున్నారని ఆమె ఆరోపించారు. దాడిలో గాయపడిన వెంకటమ్మను ముందుగా జడ్చర్ల ఆసుపత్రికి తరలించి, అనంతరం మెరుగైన చికిత్స కోసం మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి న్యాయం చేయాలని బాధితురాలు పోలీసులను కోరుతున్నారు

## కాంగ్రెస్ మూల సిద్ధాంతం సెక్యులరిజం

- ఎంపీ మల్లు రవి - మందుల సామేల్ వ్యాఖ్యలపై స్పష్టీకరణ

**వేద న్యూస్, నాగర్‌కర్నూల్:**



కాంగ్రెస్ పార్టీ మూల సిద్ధాంతం సెక్యులరిజం అని, అన్ని మతాలను సమానంగా గౌరవించడం పార్టీ లక్ష్యమని నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి స్పష్టం చేశారు. సోమవారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. ఇటీవల మందుల సామేల్ చేసిన వ్యాఖ్యలను కొందరు మతపరంగా వక్రీకరిస్తున్నారని, అయితే ఆయన ఎవరినీ ఉద్దేశించి మాట్లాడలేదని ఇప్పటికే స్పష్టత ఇచ్చారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ ఏ మతానికీ వ్యతిరేకం కాదని, రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా అన్ని మతాలను గౌరవిస్తుందని చెప్పారు. దేశంలో ప్రతి ఒక్కరికీ తమకు నచ్చిన మతాన్ని ఆచరించే స్వేచ్ఛ ఉందని, అదే రాజ్యాంగం ఇచ్చిన హక్కు అని పేర్కొన్నారు. మతాల పేరుతో విభేదాలు సృష్టించకుండా ఉండాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు

## 79వ రోజుకు చేరిన రైతుల దీక్ష

- గొల్లపల్లి-చీర్కపల్లి రిజర్వాయర్‌కు వ్యతిరేకంగా నిరసన

**వేద న్యూస్, ఏదుల మండలం:**




ఏదుల మండల కేంద్రంలో గొల్లపల్లి-చీర్కపల్లి రిజర్వాయర్‌కు వ్యతిరేకంగా రైతులు చేపట్టిన నిరసన ధర్నా 79వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఉద్యమం కొనసాగుతున్న నేపథ్యంలో ప్రాజెక్ట్ నిర్మాణంపై వివిధ వాదనలు వినిపిస్తున్నాయి. కొంతమంది నాయకులు రిజర్వాయర్ నిర్మాణంపై స్పష్టత లేదని, అనుమతుల సమస్యలు ఉన్నాయని పేర్కొంటున్నారని సమాచారం. ప్రాజెక్ట్ అవసరంపై కూడా స్థానికంగా చర్చ కొనసాగుతోంది. రాజకీయాల కారణంగా ప్రజలు ఇబ్బందులు పడకూడదని కొందరు అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని స్థానిక నాయకులు సూచిస్తున్నారు. రైతులు మాత్రం తమ డిమాండ్ల సాధన వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేస్తున్నారు.

## మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యంపై సీపీఐ విమర్శలు

- నగర ముఖద్వారాల వద్ద హోర్డింగులు తొలగించాలని డిమాండ్

**వేద న్యూస్, కరీంనగర్:**



కరీంనగర్ పట్టణంలో అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన హోర్డింగులు, ఫ్లెక్సీలపై చర్యలు తీసుకోవడంలో మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు పైడిపల్లి రాజు విమర్శించారు. బీజేపీ నాయకులు మున్సిపల్ అనుమతులు తీసుకోకుండా, రుసుములు చెల్లించకుండా నగర ముఖద్వారాల వద్ద హోర్డింగులు ఏర్పాటు చేశారని ఆరోపించారు. సభ ముగిసిన తర్వాత కూడా వాటిని తొలగించకపోవడం సరైంది కాదన్నారు. ప్రజలకు నిబంధనలు చెప్పాల్సిన నాయకులే నిబంధనలు ఉల్లంఘించడం దురదృష్టకరమని పేర్కొన్నారు. నగరాన్ని సందర్శించే ప్రజలకు పట్టణ సౌందర్యం కనిపించాల్సిన చోట హోర్డింగులు కనిపించడం నగర ప్రతిష్ఠకు భంగం కలిగిస్తోందని అన్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు వెంటనే ఫ్లెక్సీలు, హోర్డింగులను తొలగించాలని, లేనిపక్షంలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

## రత్నంపేట పాఠశాలకు వాటర్ డిస్పెన్సర్ విరాళం

**వేద న్యూస్, బోయినిపల్లి:**



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం రత్నంపేట గ్రామంలో ఎన్ఆర్ఐ, గల్ఫ్ వర్కర్స్ విలేజ్ డెవలప్మెంట్ కమిటీ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు వాటర్ డిస్పెన్సర్‌ను విరాళంగా అందించారు. కోల్డ్, నార్మల్, హాట్ వాటర్ సదుపాయాలతో ఉన్న ఈ డిస్పెన్సర్ ద్వారా విద్యార్థులకు శుభ్రమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో కార్యక్రమాన్ని చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. గ్రామ ప్రజలు, పాఠశాల సిబ్బంది ఈ సేవను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎదులపురం రాజేంద్ర ప్రసాద్, కౌడగాని రామోజీ, మారరాజేందర్, ఇటిక్యాల రాజయ్య, అత్తెన మహేందర్, ఉగిలే కార్తీక్, రాగళ్ల శీను, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## పోలంపల్లి సమస్యలపై వినతి

- సింగరేణి డైరెక్టర్‌ను కలిసిన యూత్ ప్రెసిడెంట్ ధోనీ నాయక్

**వేద న్యూస్ ,కారేపల్లి :**




సింగరేణి మండల పరిధిలోని పోలంపల్లి గ్రామ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా మంగళవారం పిఎస్ఆర్ మండల యూత్ ప్రెసిడెంట్ జర్పుల ధోనీ నాయక్ చొరవ తీసుకున్నారు. కొత్తగూడెంలోని సింగరేణి సంస్థ ప్రధాన కార్యాలయంలో డైరెక్టర్ వెంకటేశ్వర్లును ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు.

మహిళా సాధికారతకు ప్రాధాన్యత ఈ భేటీలో గ్రామంలోని పలు సమస్యలను డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్లిన ధోనీ నాయక్, ముఖ్యంగా గ్రామ మహిళల ఆర్థికాభివృద్ధిపై చర్చించారు. పోలంపల్లి గ్రామంలో ఉన్న మహిళలకు సింగరేణి సంస్థ ద్వారా తగిన ఉపాధి అవకాశాలు కల్పించాలని, తద్వారా ఆయా కుటుంబాలకు అండగా నిలవాలని ఆయన కోరారు.

**సానుకూల స్పందన**

గ్రామ సమస్యలను సావధానంగా విన్న డైరెక్టర్ వెంకటేశ్వర్లు, సమస్యల పరిష్కారానికి సానుకూలంగా స్పందించారు. నిబంధనల ప్రకారం గ్రామాభివృద్ధికి, మహిళల ఉపాధికి తమ వంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు లకావత్ రమేష్ నాయక్ కూడా పాల్గొని, గ్రామ సమస్యల పరిష్కారానికి తమ మద్దతును తెలిపారు. యువ నాయకత్వం చొరవ చూపి గ్రామ సమస్యలను నేరుగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడం పట్ల పోలంపల్లి గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## రాజీ మార్గమే రాజమార్గం

- 28న లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి
- ఇన్చార్జి జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి. పుష్పలత

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**




కోర్టు కేసుల్లో ఇరుపక్షాలు రాజీ పడటం ద్వారా సమయం, డబ్బు ఆదా అవుతాయని, రాజీ మార్గమే ఉత్తమ మార్గమని జిల్లా ఇన్చార్జి ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షురాలు బి. పుష్పలత అన్నారు. మంగళవారం జిల్లా కోర్టు సముదాయంలో న్యాయమూర్తులు, పోలీసు అధికారులు, బార్ అసోసియేషన్ ప్రతినిధులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ నెల 28న నిర్వహించే లోక్ అదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. పెండింగ్ కేసులను పరస్పర అంగీకారంతో పరిష్కరించడం ద్వారా ఇరు వర్గాల మధ్య సత్సంబంధాలు పెరుగుతాయని పేర్కొన్నారు. కేసుల పరిష్కారంలో పోలీసులు, న్యాయవాదులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. సమావేశంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, సీనియర్ సివిల్ జడ్జిలు, డీఎస్పీలు, మేజిస్ట్రేట్లు, న్యాయవాదులు పాల్గొన్నారు.

## ఆరు గ్యారంటీలు వెంటనే అమలు చేయాలి

- తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీజేపీ నిరసన
- వినతిప్రతం సమర్పణ

**వేద న్యూస్, శంకరపట్నం:**



కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలైన ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ నాయకులు శంకరపట్నం మండల తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. మండల అధ్యక్షుడు ఎనుగుల అనిల్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ.. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు రూ.2500, పెన్షన్ల పెంపు, యువతులకు స్కూటీలు, కళ్యాణ లక్ష్మి లబ్ధిదారులకు తులం బంగారం వంటి హామీలు అమలు కాలేదని విమర్శించారు. రైతులకు రైతు భరోసా కూడా అందకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రభుత్వం వెంటనే హామీలను అమలు చేయాలని, లేనిపక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అలివేలు సమిరెడ్డి, నాయకులు దొంగల రాములు, కొయ్యడ కుమార్, దాసారపు నరేందర్, మందాడి జగ్గారెడ్డి, రాసమల్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వేద న్యూస్

బుధవారం మార్చి 18, 2026

# జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ కిట్ల పంపిణీ

**వేద న్యూస్, మందమర్రి :**



ప్రకృతి సిద్ధమైన వనరులను ఉపయోగించి సాగు చేసే పద్ధతిని ప్రోత్సహించాలనే లక్ష్యంతో ప్రవేశపెట్టిన రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా మందమర్రి మండలంలోని సండ్రోన్ పల్లి రైతు వేదికలో జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ కిట్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఆదిల్ పేట గ్రామానికి చెందిన రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమం ప్రారంభంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సహజ వ్యవసాయం, ప్రకృతి వ్యవసాయం ప్రాముఖ్యతపై ఇచ్చిన సందేశాన్ని రైతులు దృశ్యశ్రవణ మాధ్యమం ద్వారా వీక్షించారు. అనంతరం మండల వ్యవసాయ అధికారి జి. కిరణమై, వ్యవసాయ విస్తరణ అధికారి ముత్యం తిరుపతి, ఆదిల్ పేట గ్రామ సర్పంచ్ నెండుగూరి పున్నం లు రైతులకు సహజ వ్యవసాయ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు ఈ కిట్లను సమర్థంగా వినియోగించి సేంద్రియ విధానాల్లో వివిధ కషాయాలు తయారు చేసి పంటలపై ఉపయోగించాలని సూచించారు. సహజ వ్యవసాయం ద్వారా ఖర్చులు తగ్గడంతో పాటు పంటల దిగుబడులు మెరుగుపడతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆదిల్ పేట గ్రామానికి చెందిన పలువురు రైతులు పాల్గొన్నారు.

# ఏసీపీని కలిసిన సింగరేణి జి.ఎం రాధాకృష్ణ

**వేద న్యూస్, మందమర్రి :**



మందమర్రి ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ మంగళవారం బెల్లంపల్లి పట్టణ నూతన ఏసిపిగా బాధ్యతలు స్వీకరించిన కిరణ్ కుమార్ ను తన కార్యాలయం లో మర్యాదపూర్వకముగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఏసిపికి జి.ఎం పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. మందమర్రి ఏరియా లోని శాంతిభద్రతల పరిరక్షణ మరియు పోలీసు విభాగంతో ఉన్న అనుబంధంపై ఈ సందర్భంగా చర్చించారు.సంస్థ భద్రత విషయంలో మరియు స్థానిక సమస్యల పరిష్కారంలో పోలీసు యంత్రాంగం అందిస్తున్న సహకారానికి జి.ఎం ధన్యవాదాలు తెలిపారు.

# గట్టుబుత్కూర్‌లో ఉచిత వైద్య శిబిరం

**వేద న్యూస్, గంగాధర:**

గంగాధర మండలం గట్టుబుత్కూర్ గ్రామంలో గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం సాయంత్రం 5 నుండి 7 గంటల వరకు మెడికవర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు సర్పంచ్ మల్కాపురం రాజేశ్వరి-రాజేశం తెలిపారు. గ్రామ ప్రజలకు ప్రాథమిక వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడమే ఈ శిబిరం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. నిపుణులైన వైద్యులు రక్తపోటు, షుగర్, హిమోగ్లోబిన్, గుండె సంబంధిత పరీక్షలను ఉచితంగా నిర్వహించడంతో పాటు అవసరమైన వారికి వైద్య సలహాలు అందిస్తారని తెలిపారు. గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ కోరారు.

# పోగొట్టుకున్న మొబైల్ బాధితురాలికి అప్పగింత

**వేద న్యూస్, శంకరపట్నం:**



శంకరపట్నం మండలం మెట్టుపల్లి గ్రామానికి చెందిన ఈరబోయిన గంగమ్మ పోగొట్టుకున్న మొబైల్‌ను పోలీసులు గుర్తించి తిరిగి అప్పగించారు. ఈ మేరకు మండల ఎస్సై శేఖర్ రెడ్డి వివరించారు. మహిళ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు సీఈఐఆర్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసి మొబైల్‌ను ట్రేస్ చేసి బాధితురాలికి అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ, ఎవరికైనా మొబైల్ పోగొట్టుకున్నట్లయితే వెంటనే సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేయాలని, దీంతో మొబైల్‌ను తిరిగి పొందే అవకాశం ఉంటుందని సూచించారు.

# కాజీపేటలో రైల్వే తయారీ యూనిట్ త్వరలో ప్రారంభం

- 85 శాతం పనులు పూర్తి చేసిన ఆర్ఎమ్‌యూ
- రూ.521 కోట్లతో నిర్మాణం చేపట్టిన ప్రాజెక్టు
- ప్రాంత పారిశ్రామికాభివృద్ధికి ఊతం

**వేద న్యూస్ కాజీపేట:**



తెలంగాణలోని కాజీపేటలో నిర్మిస్తున్న రైల్వే మాన్యుఫాక్చరింగ్ యూనిట్ త్వరలో ప్రారంభానికి సిద్ధమవుతోంది. భారతీయ రైల్వే సామర్థ్యాన్ని పెంచడంతో పాటు ఈ ప్రాంత పారిశ్రామిక అభివృద్ధికి కూడా ఈ ప్రాజెక్టు కీలకంగా మారనుంది. ఇప్పటికే ఈ యూనిట్ నిర్మాణ పనులు దాదాపు 85 శాతం పూర్తయ్యాయని అధికారులు తెలిపారు. మొత్తం రూ.521.36 కోట్ల వ్యయంతో ఈ ప్రాజెక్టును చేపట్టారు. కాజీపేటలో ఏర్పాటు చేస్తున్న ఈ రైల్వే



తయారీ కేంద్రం ద్వారా రైల్వే కోచ్‌లు, భాగాల తయారీ మరియు నిర్వహణ కార్యకలాపాలు మరింత వేగవంతం అవుతాయని అధికారులు పేర్కొన్నారు. ఈ యూనిట్ ప్రారంభమైతే రైల్వే రంగంలో సాంకేతిక సామర్థ్యాలు పెరగడంతో పాటు స్థానికంగా ఉపాధి అవకాశాలు కూడా విస్తరించే అవకాశముంది. ప్రస్తుతం యూనిట్‌లో ప్రధాన షాప్, టెస్ట్ షాప్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. అలాగే పెయింట్ షాప్, పరిపాలన భవనాల నిర్మాణం కూడా జరుగుతోంది. అంతర్గత రైల్వే ట్రాక్‌లు, ఇతర అవసరమైన సౌకర్యాల ఏర్పాట్లు కూడా వేగంగా పూర్తి దశకు చేరుకున్నాయని అధికారులు వెల్లడించారు. ఈ ప్రాజెక్టు పూర్తయిన తర్వాత కాజీపేట ప్రాంతం రైల్వే పరిశ్రమకు ముఖ్య కేంద్రంగా మారే అవకాశం ఉందని భావిస్తున్నారు. రైల్వే తయారీ రంగంలో కొత్త అవకాశాలను సృష్టించడంతో పాటు ప్రాంతీయ ఆర్థికాభివృద్ధికి కూడా ఈ యూనిట్ దోహదపడుతుందని అధికారులు పేర్కొన్నారు.

# ఇది స్క్వాడ్ కాదు.. కావ్యపాప ఖతర్నాక్ బ్యాచ్

**వేద న్యూస్ డెస్క్:**




ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 సీజన్‌కు సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు భారీ అంచనాలతో సిద్ధమవుతోంది. మార్చి 28న ప్రారంభమయ్యే ఈ సీజన్‌లో తొలి మ్యాచ్‌లోనే బెంగళూరు జట్టుతో తలపడనున్న హైదరాబాద్, ఈసారి గత వైఫల్యాలను మరచిపోయి బలంగా తిరిగి రావాలని లక్ష్యంగా పెట్టుకుంది. గత సీజన్‌లో ఆరో స్థానంతో ముగించి ప్లేఆఫ్స్‌కు చేరుకోలేకపోయిన ఈ జట్టు, ఇప్పుడు కొత్త ఆటగాళ్లతో సమతుల్య కూర్పుతో మరింత పటిష్టంగా కనిపిస్తోంది. ఈసారి జట్టు కూర్పు ఎంతో ఆకర్షణీయంగా ఉంది. ఇషాన్ కిషన్, అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్ వంటి దూకుడైన ఆటగాళ్లు టాప్ ఆర్డర్‌లో బలమైన ఆరంభం ఇవ్వగల సామర్థ్యం కలవారు. ముఖ్యంగా ఇషాన్ కిషన్ ఇటీవల అద్భుత ఫామ్‌లో ఉండటం జట్టుకు పెద్ద ప్లస్‌గా మారింది. మధ్య వరుసలో హెన్రిచ్ క్లాసెన్, కమిందు మెండిస్, లియామ్ లివింగ్‌స్టోన్ వంటి ఆటగాళ్లు జట్టుకు బలాన్ని చేకూరుస్తున్నారు. అభిషేక్ శర్మ నుంచి లియామ్ లివింగ్‌స్టోన్ వరకు అనేక ఆల్‌రౌండర్లు జట్టులో ఉండటం ప్రత్యేకతగా నిలుస్తోంది. వీరు బ్యాటింగ్, బౌలింగ్ రెండింట్లోనూ కీలక పాత్ర పోషించగలరు. ఈ సమతుల్యత జట్టుకు అనుకూల పరిస్థితులను సృష్టించడంలో సహాయపడుతుంది. అలాగే హర్షల్ పటేల్, జయదేవ్ ఉనద్కట్, శివమ్ మావి వంటి బౌలర్లు బౌలింగ్ విభాగాన్ని బలోపేతం చేస్తున్నారు. అయితే బౌలింగ్‌లో స్థిరత్వం సాధించడం జట్టుకు కీలకంగా మారింది. అన్ని విభాగాల్లో సమన్వయం సాధిస్తే ఈసారి హైదరాబాద్ జట్టు ప్లేఆఫ్స్ రేసులో బలంగా నిలిచే అవకాశముంది. శక్తివంతమైన బ్యాటింగ్, అనుభవం కలిగిన ఆటగాళ్లతో ఈ జట్టు ఈసారి ప్రత్యర్థులకు గట్టి పోటీ ఇవ్వడం ఖాయం అని క్రీడా వర్గాలు భావిస్తున్నాయి.

# మాల్దీవ్స్ నుంచి నేరుగా నెట్స్‌కు.. ఐపీఎల్‌కు సిద్ధమైన రోహిత్ శర్మ

**వేద న్యూస్ డెస్క్:**



పంతొమ్మిదో సీజన్ ఇండియన్ ప్రీమియర్ లీగ్ కోసం రోహిత్ శర్మ సన్నద్ధమవుతున్నాడు. ఇటీవల కుటుంబంతో కలిసి మాల్దీవ్స్‌లో విరామం తీసుకున్న అతడు స్వదేశానికి చేరుకున్న వెంటనే ముంబై జట్టుతో చేరి సాధన ప్రారంభించాడు. మంగళవారం జట్టు సహచరులు, కోచ్ మహేల జయవర్ధనేతో కాసేపు మాట్లాడిన రోహిత్, ఆ తర్వాత మైదానంలోకి దిగాడు. నెట్స్‌లో బ్యాటింగ్, ఫీల్డింగ్ సాధన చేస్తూ పూర్తి స్థాయిలో ప్రిపరేషన్ మొదలుపెట్టాడు.గత సీజన్‌లో పదిహేను మ్యాచ్‌లలో నాలుగు వందల పద్దెనిమిది పరుగులు సాధించిన రోహిత్ ఈసారి మరింత మెరుగైన ప్రదర్శన ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నాడు. శార్దూల్ ఠాకూర్ వంటి బౌలర్లను ఎదుర్కొంటూ రక్షణాత్మక ఆటతో పాటు భారీ షాట్లపై సాధన చేశాడు. అనంతరం జట్టు సభ్యులతో కలిసి ఫీల్డింగ్‌లో కూడా పాల్గొన్నాడు. ఇండియన్ ప్రీమియర్ లీగ్ చరిత్రలో అత్యంత విజయవంతమైన కెప్టెన్లలో ఒకరిగా నిలిచిన రోహిత్ శర్మ, తన సారథ్యంలో ముంబై జట్టును ఐదు సార్లు విజేతగా నిలిపాడు. ప్రస్తుతం జట్టు హార్దిక్ పాండ్యా నాయకత్వంలో ఆడుతున్నప్పటికీ, రోహిత్ అనుభవం జట్టుకు కీలకంగా మారనుంది. లీగ్ ప్రారంభానికి ఇంకా కొన్ని రోజులు మాత్రమే మిగిలి ఉండటంతో, రోహిత్ తన సాధనను మరింత ముమ్మరం చేశాడు. అభిమానులు మరోసారి అతడి నుంచి భారీ ఇన్నింగ్స్‌లను ఆశిస్తున్నారు.

# టీ20ల్లో అమేలియా కేర్ సంచలనం..

**వేద న్యూస్ డెస్క్:**




అంతర్జాతీయ టీ20 క్రికెట్‌లో న్యూజిలాండ్ స్టార్ ఆల్‌రౌండర్ అమేలియా కేర్ అద్భుతమైన చరిత్ర సృష్టించింది. పొట్టి ఫార్మాట్‌లో అత్యంత వేగంగా వెయ్యికి పైగా పరుగులు, వందకు పైగా వికెట్లు సాధించిన మహిళా క్రికెటర్‌గా ఆమె అరుదైన ఘనతను తన ఖాతాలో వేసుకుంది. స్వదేశంలో దక్షిణాఫ్రికాతో జరుగుతున్న ద్వైపాక్షిక సిరీస్‌లో అమేలియా తన ప్రతిభను మరోసారి చాటుకుంది. రెండో టీ20 మ్యాచ్‌లో ఆమె వందో వికెట్ సాధించడం ద్వారా ఈ మైలురాయిని చేరు కుంది. ముఖ్యంగా ఈ ఘనతను ఆమె కేవలం 94 ఇన్నింగ్స్‌ల్లోనే అందుకోవడం విశేషం. దీంతో ఈ ఫార్మాట్‌లో వేగవంతమైన ఆల్‌రౌండర్‌లలో అగ్రస్థానానికి చేరుకుంది. ఇటీవలి కాలంలో అమేలియా కేర్ ప్రదర్శన అద్భుతంగా కొనసాగుతోంది. బ్యాటింగ్‌లో కీలక పరుగులు సాధించడమే కాకుండా, బౌలింగ్‌లోనూ ప్రత్యర్థి జట్లను కట్టడి చేస్తోంది. గత ఏడాది టీ20ల్లో తన తొలి శతకం నమోదు చేసి సంచలనం సృష్టించిన ఆమె, ఇప్పుడు మరో చారిత్రాత్మక ఘనతతో వార్తల్లో నిలిచింది. ఈ రికార్డుతో న్యూజిలాండ్ తరఫున ఈ ఫీట్ సాధించిన మూడో క్రికెటర్‌గా అమేలియా నిలిచింది. ఆమెకు ముందు సోఫీ డివైన్, మిచెల్ శాంట్నర్ ఈ ఘనతను అందుకున్నారు. దీంతో కివీస్ జట్టులో ఆల్‌రౌండర్‌ల సత్తా మరోసారి వెలుగులోకి వచ్చింది. ప్రపంచ స్థాయిలో చూస్తే, అసోసియేట్ దేశాల ఆటగాడు క్యారీ చాన్ ఈ జాబితాలో అగ్రస్థానంలో ఉన్నాడు. అతడు కేవలం 74 ఇన్నింగ్స్‌ల్లోనే వెయ్యికి పైగా పరుగులు, వందకు పైగా వికెట్లు సాధించాడు. పురుషుల క్రికెట్‌లో బంగ్లాదేశ్ స్టార్ ఆల్‌రౌండర్ షకీబ్ అల్ హసన్ 84 ఇన్నింగ్స్‌ల్లో ఈ ఘనతను అందుకొని రెండో స్థానంలో నిలిచాడు. మహిళా క్రికెట్‌లో ఇప్పటికే ఈ అరుదైన క్లబ్‌లో భారత్‌కు చెందిన దీప్తి శర్మ, పాకిస్థాన్‌కు చెందిన నిదా దార్, ఆస్ట్రేలియాకు చెందిన ఎలీసా పెర్రీ, న్యూజిలాండ్‌కు చెందిన సోఫీ డివైన్, వెస్టిండీస్‌కు చెందిన హీలీ మాథ్యూస్ వంటి ప్రముఖులు ఉన్నారు.

# మిథాలీ రాజ్‌కు జీవిత సాఫల్య పురస్కారం

**వేద న్యూస్ డెస్క్:**



భారత మహిళా క్రికెట్‌లో చిరస్మరణీయ స్థానం సంపాదించిన దిగ్గజ ఆటగాళ్లలో ఒకరైన మిథాలీ రాజ్‌కు ప్రతిష్టాత్మక జీవిత సాఫల్య పురస్కారం లభించింది. భారత క్రికెట్ నియం త్రణ మండలి నిర్వహించిన వార్షిక 'నమన్' అవార్డుల కార్యక్రమంలో ఆమెకు ఈ గౌరవాన్ని ప్రదానం చేశారు. క్రికెట్ రంగానికి రెండు దశాబ్దాలకు పైగా చేసిన విశిష్ట సేవలకు గుర్తింపుగా ఈ అవార్డు అందుకున్న మిథాలీ రాజ్, ఈ సందర్భంగా భావోద్వేగంతో స్పందిం చారు. ప్రపంచ క్రికెట్ వేదికపై భారత జట్లు అగ్రస్థానంలో నిలవాలని తాను ఎప్పటి నుంచో కలగన్నానని, ప్రస్తుతం ఆ కల నిజమవుతోందని ఆమె పేర్కొన్నారు. గత కొన్నేళ్లుగా భారత పురుషుల, మహిళల మరియు జూనియర్ జట్లు అంతర్జాతీయ స్థాయిలో అద్భుత ప్రదర్శన కనబరుస్తున్నాయని మిథాలీ కొనియాడారు. మహిళా క్రికెట్ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న జై షా కృషిని ప్రత్యేకంగా అభినందించారు.

వేద న్యూస్

బుధవారం మార్చి 18, 2026

# ఒక్క సినిమాతోనే భారీ క్రేజ్.. ఆరాధ్యదేవి చర్చలోకి



**వేద న్యూస్ డెస్క్:**

సినిమా పరిశ్రమలో ప్రతి రోజూ కొత్త ముఖాలు పరిచయమవుతుంటాయి. అయితే అందరిలో కొందరు మాత్రమే తక్కువ సమయంలోనే ప్రత్యేక గుర్తింపును సంపాదించి ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తారు. అలాంటి అరుదైన ఉదాహరణగా ఆరాధ్యదేవి పేరు ప్రస్తుతం విస్తృతంగా వినిపిస్తోంది. ఒక్క సినిమాతోనే భారీ స్థాయిలో గుర్తింపు పొందుతూ, సామాజిక మాధ్యమాల్లో ట్రెండింగ్‌గా మారడం ఆమె ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు. ఆరాధ్యదేవి అసలు పేరు శ్రీలక్ష్మి సతీష్. మొదటగా సామాజిక మాధ్యమాల్లో చిన్న వీడియోలు, వినోదాత్మక కంటెంట్, గ్లామర్ ఫోటోషూట్ల ద్వారా ఆమె యువతలో మంచి గుర్తింపు సంపాదించింది. తన ప్రత్యేకమైన ప్రెజెన్స్, ఆకర్షణీయమైన వ్యక్తిత్వంతో త్వరగానే పెద్ద సంఖ్యలో అభిమానులను సంపాదించుకుంది. ఈ నేపథ్యంలోనే ఆమెపై సినీ వర్గాల దృష్టి పడింది. ముఖ్యంగా ప్రముఖ దర్శకుడు రామ్ గోపాల్ వర్మ ఆమెను గమనించి, తన చిత్రంలో అవకాశం ఇవ్వడం ఆమె కెరీర్‌కు కీలక మలుపుగా మారింది. రామ్ గోపాల్ వర్మ తెరకెక్కించిన 'పేటి శారీ' చిత్రంతో ఆరాధ్యదేవి హీరోయిన్‌గా పరిచయం అయింది. ఈ సినిమా విడుదలకుముందే ఆమె గ్లామర్ లుక్స్, పోస్టర్లు, ప్రచార వీడియోలు నెట్టింట విస్తృతంగా వైరల్ అయ్యాయి. సినిమా విడుదల తర్వాత కూడా ఆమె పాత్ర, ప్రదర్శనపై చర్చ కొనసాగింది. సినిమా వాణిజ్యపరంగా ఆశించిన స్థాయిలో విజయాన్ని అందుకోకపోయినా, ఆరాధ్యదేవికి మాత్రం మంచి గుర్తింపు దక్కింది. ముఖ్యంగా యువతలో ఆమెకు భారీ క్రేజ్ ఏర్పడింది.

సామాజిక మాధ్యమాల్లో ఆమెకు ఉన్న ఫాలోయింగ్ రోజురోజుకీ పెరుగుతోంది. ఆమె పంచుకునే ఫోటోలు, వీడియోలు తక్షణమే వైరల్ అవుతూ లక్షల సంఖ్యలో వీక్షణలు సాధిస్తున్నాయి. ఫ్యాషన్, గ్లామర్, స్టైల్ పరంగా ఆమె ప్రత్యేకతను చూపిస్తూ అభిమానులను ఆకట్టుకుంటోంది. ఈ నేపథ్యంలోనే అనేక నిర్మాణ సంస్థలు, దర్శకులు ఆమెపై దృష్టి సారిస్తున్నట్లు సమాచారం. గతంలో ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో ఆరాధ్యదేవి తన అభిప్రాయాలను వెల్లడిస్తూ, తాను నటిగా విభిన్న పాత్రలు చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నానని తెలిపింది. గ్లామర్ పాత్రల విషయంలో తన ఆలోచనలు మారాయని, కథకు అవసరమైతే ఎలాంటి పాత్రనైనా స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నానని పేర్కొంది. నటనలో తన ప్రతిభను నిరూపించుకోవడం ప్రధాన లక్ష్యమని, కేవలం గ్లామర్‌కే పరిమితం కావాలని తాను అనుకోవడం లేదని స్పష్టం చేసింది. సినిమా ఫలితాల కంటే తన కృషి, అభివృద్ధి ముఖ్యం అని భావిస్తున్న ఆరాధ్యదేవి, ప్రతి అవకాశాన్ని వినియోగించుకోవాలని చూస్తోంది. పరిశ్రమలో స్థిరపడేందుకు అవసరమైన శ్రమ, పట్టుదలతో ముందుకు సాగుతోంది. భవిష్యత్తులో మరిన్ని చిత్రాల్లో నటిస్తూ తన ప్రతిభను చాటుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. మొత్తంగా చూస్తే, ఒక్క సినిమాతోనే ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించి భారీ క్రేజ్ సంపాదించిన ఆరాధ్యదేవి, రాబోయే రోజుల్లో సినీ పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక స్థానం ఏర్పరచుకుంటుందా అనే ఆసక్తి నెలకొంది. ఆమె కెరీర్ ఎలా మలుపుతిరుగుతుందో చూడాలని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# శేఖర్ కమ్ముల కథకు నో చెప్పిన నాని?



**వేద న్యూస్ డెస్క్:**

టాలీవుడ్‌లో సహజ నటుడిగా గుర్తింపు పొందిన నాని తన కెరీర్‌ను కొత్త దిశగా మలుచుకునే ప్రయత్నాల్లో ఉన్నాడు. ఇండస్ట్రీలో అగ్రశ్రేణి హీరోగా నిలవాలనే లక్ష్యంతో ప్రస్తుతం మాస్ కథలపై ఎక్కువగా దృష్టి సారిస్తున్నట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇప్పటి వరకు క్లాస్ కథలతో ప్రేక్షకులను ఆకట్టుకున్న నాని, ఇప్పుడు బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లు సాధించే మాస్ మసాలా చిత్రాలను ఎంచుకుంటున్నాడని సమాచారం. ఈ నేపథ్యంలో ప్రముఖ దర్శకుడు శేఖర్ కమ్ముల చెప్పిన కథను నాని తిరస్కరించినట్లు ప్రచారం జరుగుతోంది. సున్నితమైన భావోద్వేగాలతో కూడిన కథలకు ప్రసిద్ధి చెందిన శేఖర్ కమ్ముల, నానిని దృష్టిలో పెట్టుకుని ఒక ప్రత్యేక కథను సిద్ధం చేసినప్పటికీ, ప్రస్తుతం తాను మాస్ ఇమేజ్‌ను బలోపేతం చేసుకోవాలనే దిశగా ముందుకు సాగుతున్నానని నాని తెలిపినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఈ సమయంలో క్లాస్ కథలకు వెళ్లడం కష్టం అని సున్నితంగా ఆ ప్రాజెక్ట్‌ను తిరస్కరించినట్లు టాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. గతంలో కూడా నాగచైతన్య హీరోగా తెరకెక్కిన 'లవ్ స్టోరీ' చిత్రానికి ముందుగా నానినే ఎంపిక చేయాలని శేఖర్ కమ్ముల భావించినప్పటికీ, అప్పట్లో కూడా నాని ఆసక్తి చూపలేదని సమాచారం. దీంతో ఆ అవకాశం నాగచైతన్యకు వెళ్లింది. ఈ విధంగా వరుసగా ప్రాజెక్టులు నాని వద్ద నుంచి తిరస్కరణకు గురవడంతో శేఖర్ కమ్ముల కొంత నిరాశకు గురైనట్లు ప్రచారం సాగుతోంది. ఇదిలా ఉండగా, శేఖర్ కమ్ముల ప్రస్తుతం తన తదుపరి చిత్రం 'హ్యాపీడేస్ 2' పనుల్లో నిమగ్నమై ఉన్నారు. ఈ చిత్రానికి సంబంధించిన కథా రచన పూర్తయ్యిందని, త్వరలోనే అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉందని సినీ వర్గాలు పేర్కొంటున్నాయి. మరోవైపు నాని కూడా తన కెరీర్‌ను మరింత విస్తరించే దిశగా భారీ ప్రాజెక్టులను సిద్ధం చేసుకుంటున్నాడు. మాస్ కథలతో ప్రేక్షకులను అలరించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నాడు. భవిష్యత్తులో అయినా నాని శేఖర్ కమ్ముల కాంబినేషన్‌లో సినిమా వస్తుందా అన్నది ఆసక్తికరంగా మారింది. సినీ అభిమానులు మాత్రం ఈ కలయిక ఎప్పుడో ఒకప్పుడు నిజం కావాలని ఆశిస్తున్నారు.

# మరో మెగా ప్రాజెక్ట్ ప్లాన్‌లో హరీష్ శంకర్.. చిరంజీవితో సినిమా సంకేతాలు


**వేద న్యూస్ డెస్క్:**




పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా తెరకెక్కిన 'ఉస్తాద్ భగత్ సింగ్' విడుదలకు సిద్ధమవుతున్న వేళ దర్శకుడు హరీష్ శంకర్ ప్రమోషన్ కార్యక్రమాల్లో బిజీగా ఉన్నారు. వరుస ఇంటర్వ్యూల్లో పాల్గొంటూ సినిమా విశేషాలను పంచుకుంటున్న ఆయన, తాజాగా మెగాస్టార్ చిరంజీవితో సినిమా గురించి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు వైరల్‌గా మారాయి. 'ఉస్తాద్ భగత్ సింగ్' గురించి మాట్లాడిన హరీష్ శంకర్, ఇది పవన్ కళ్యాణ్ అభిమానులకు నిజమైన మాస్ జాతరలా ఉంటుందని తెలిపారు. 'గబ్బర్ సింగ్' తర్వాత మరోసారి పవన్‌ను పవర్‌ఫుల్ పోలీస్ పాత్రలో చూపిస్తున్నామని, యాక్షన్ సన్నివేశాలు, డైలాగులు థియేటర్లలో అభిమానులతో ఈలలు వేయించేలా ఉంటాయని చెప్పారు. ఇక ఈ సినిమా ట్రైలర్ చూసిన తర్వాత చిరంజీవి తనకు ఫోన్ చేసి దాదాపు ఇరవై నిమిషాల పాటు మాట్లాడినట్లు హరీష్ శంకర్ వెల్లడించారు. ట్రైలర్‌లోని ప్రతి అంశంపై ఆయన ఆసక్తిగా చర్చించారని, పవన్ కళ్యాణ్ లుక్, డైలాగులు చాలా బాగున్నాయని ప్రశంసించారని చెప్పారు. ఆ సంభాషణతో చిరంజీవికి పవన్ కళ్యాణ్‌పై ఉన్న అనుబంధం ఎంత గొప్పదో తనకు అర్థమైందని తెలిపారు తన భవిష్యత్ ప్రాజెక్టుల గురించి కూడా హరీష్ శంకర్ ఆసక్తికర విషయాలు వెల్లడించారు. చిరంజీవితో సినిమా చేయడం తన చిరకాల కోరిక అని చెప్పిన ఆయన, త్వరలోనే ఆయనతో ఒక పూర్తి స్థాయి మాస్ ఎంటర్‌టైనర్ చేయాలని భావిస్తున్నట్లు తెలిపారు. ఆ సినిమా 'రౌడీ అల్లుడు', 'గ్యాంగ్ లీడర్', 'దొంగ మొగుడు' తరహాలో వింటేజ్ మాస్ స్టైల్‌లో ఉండేలా రూపొందించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. ప్రస్తుతం చిరంజీవి 'విశ్వంభర' వంటి భారీ ప్రాజెక్టులతో బిజీగా ఉండగా, హరీష్ శంకర్ కూడా 'ఉస్తాద్ భగత్ సింగ్' విడుదల తర్వాత కొత్త ప్రాజెక్టులపై దృష్టి పెట్టనున్నారు. ఈ నేపథ్యంలో ఈ ఇద్దరి కాంబినేషన్ ఎప్పుడు అధికారికంగా ప్రారంభమవుతుందోనని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# 'ఉస్తాద్ భగత్ సింగ్'కు కౌంట్‌డౌన్..

# ఓవర్సీస్‌లో భారీ ప్రీ-సేల్స్




**వేద న్యూస్ డెస్క్:**

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా తెరకెక్కుతున్న భారీ మాస్ యాక్షన్ చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్' విడుదలకు సమయం దగ్గరపడుతున్న కొద్దీ అభిమానుల్లో ఉత్సాహం మరింత పెరుగుతోంది. దర్శకుడు హరీష్ శంకర్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రానికి ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా దర్శకుడు హరీష్ శంకర్ సినిమా ఫైనల్ వెర్షన్ చూసిన అనంతరం తన ఆనందాన్ని వ్యక్తం చేశారు. చిత్రం పూర్తిగా సిద్ధమైందని, ఫలితం పట్ల చాలా సంతృప్తిగా ఉన్నానని తెలిపారు. అభిమానులకు పూర్తి స్థాయి మాస్ వినోదాన్ని అందించేలా ఈ సినిమా ఉంటుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఓవర్సీస్ మార్కెట్‌లో కూడా ఈ సినిమా మంచి ప్రభంజనం సృష్టిస్తోంది. ముఖ్యంగా ఉత్తర అమెరికాలో అడ్వాన్స్ బుకింగ్స్ వేగంగా పెరుగుతున్నాయి. విడుదలకు ముందే ప్రీ-సేల్స్ రెండు లక్షల యాభై వేల డాలర్ల మార్క్‌ను దాటడం ట్రేడ్ వర్గాలను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఈ ట్రెండ్ కొనసాగితే ప్రీమియర్ షోలతోనే భారీ ఓపెనింగ్స్ నమోదు కావచ్చని అంచనా వేస్తున్నారు. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ భారీ వ్యయంతో నిర్మిస్తోంది. ఇందులో శ్రీలీల, రాశీ ఖన్నా హీరోయిన్లుగా నటిస్తున్నారు. పార్థిబన్, గౌతమి, రావు రమేష్, కె.ఎస్. రవికుమార్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. పవన్ కళ్యాణ్ ఈ సినిమాలో మాస్ పోలీస్ అధికారి పాత్రలో నటిస్తున్నట్లు సమాచారం. సంగీత పరంగా కూడా ఈ సినిమా మంచి హైప్ సంపాదించింది. దేవిశ్రీ ప్రసాద్ అందించిన పాటలు ఇప్పటికే అభిమానులను ఆకట్టుకున్నాయి. నేపథ్య సంగీతాన్ని థమన్ అందించగా, యాక్షన్ సన్నివేశాలకు అది మరింత బలం చేకూరుస్తుందని చిత్ర బృందం భావిస్తోంది. టికెట్ ధరలను కూడా సాధారణ ప్రేక్షకులకు అందుబాటులో ఉండేలా నిర్ణయించడంతో మరింత పెద్ద ఓపెనింగ్స్ సాధించే అవకాశాలు కనిపిస్తున్నాయి. భారీ క్రేజ్, అభిమానుల అంచనాలు, అడ్వాన్స్ బుకింగ్స్‌ఖిశ్రీశ్రీ కలిసి వస్తే 'ఉస్తాద్ భగత్ సింగ్' బాక్సాఫీస్ వద్ద రికార్డులు సృష్టించే అవకాశాలు ఉన్నాయని సినీ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

# బురఖాలో మెరిసిన బిగ్ బాస్ బ్యూటీ..



**వేద న్యూస్ డెస్క్:**

బిగ్ బాస్ షో ద్వారా మంచి గుర్తింపు తెచ్చుకున్న నటి దివి తాజాగా మరోసారి సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. బురఖా ధరించి చార్మినార్ పరిసరాల్లో షాపింగ్ చేస్తూ కనిపించిన ఆమె వీడియో నెట్టింట చర్చనీయాంశమైంది. సినిమాల్లో చిన్న చిన్న పాత్రలతో కెరీర్ ప్రారంభించిన దివి, సూపర్ స్టార్ మహేష్ బాబు నటించిన 'మహర్షి' చిత్రంతో గుర్తింపు తెచ్చుకుంది. ఆ తర్వాత బిగ్ బాస్ షోలో పాల్గొని తన ఆటతో పాటు అందంతో ప్రేక్షకులను ఆకట్టుకుంది. షో తర్వాత ఆమెకు మంచి క్రేజ్ వచ్చినప్పటికీ, ఆశించిన స్థాయిలో అవకాశాలు మాత్రం రాలేదు. ఇటీవల దివి బురఖా ధరించి ఎవరూ గుర్తుపట్టకుండా చార్మినార్ ప్రాంతంలో షాపింగ్ చేసింది. ఆ అనుభవానికి సంబంధించిన వీడియోను తన సామాజిక మాధ్యమాల్లో పంచుకోవడంతో అది వైరల్‌గా మారింది. బురఖాలో ఉన్నప్పటికీ ఆమె స్టైల్, నడక చూసి అభిమానులు గుర్తుపట్టే ప్రయత్నం చేయడం గమనార్హం. చిరంజీవి నటించిన 'గాడ్ ఫాదర్' చిత్రంలో కీలక పాత్రలో కనిపించిన దివి, 'లంబాసింగి' వంటి చిత్రాల్లో ప్రధాన పాత్రలు కూడా పోషించింది. ప్రస్తుతం సినిమాల కంటే సామాజిక మాధ్యమాల్లో ఎక్కువగా యాక్టివ్‌గా ఉంటూ అభిమానులతో టచ్‌లో ఉంటుంది. రంజాన్ మాసం సందర్భంగా చార్మినార్ పరిసరాల్లో ప్రత్యేక సందడి నెలకొన్న నేపథ్యంలో, అక్కడ షాపింగ్ చేసిన దివి వీడియో నెటిజన్లను ఆకట్టుకుంటోంది. ఈ వీడియోపై అభిమానులు విభిన్న కామెంట్లు చేస్తూ ఆమె స్టైల్‌ను ప్రశంసిస్తున్నారు.

# ఆ పాట హిట్ అవుతుందని ఊహించలేదు..

**వేద న్యూస్ డెస్క్:**



'హుషారు' చిత్రంతో సినీ రంగ ప్రవేశం చేసిన నటి ప్రియా వడ్లమాని, 'ఉండిపోరాదే' పాటతో ఒక్కసారిగా భారీ గుర్తింపు సంపాదించింది. అయితే ఆ పాట విజయంపై, తన కెరీర్ ప్రయాణంపై ఆమె ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. ప్రియా వడ్లమాని సినీ ప్రయాణం ఒక ఆసక్తికర పరిణామంతో ప్రారంభమైంది. ఓ పూజా కార్యక్రమంలో నిర్మాత బెక్కం వేణుగోపాల్‌ను కలవడం, దర్శకుడు హర్ష తనను గమనించడం, తర్వాత సినిమా అవకాశం రావడం వంటి సంఘటనలను ఆమె గుర్తు చేసుకుంది. మొదట అది సరదా కోసం చేస్తున్న ప్రయత్నమేమో అనుకుని నిరాకరించినా,

తర్వాత నిజమని తెలుసుకుని ఆడిషన్‌కు వెళ్లినట్లు తెలిపింది. 'హుషారు' చిత్రంలో దక్ష అనే నెగటివ్ పాత్ర చేయడానికి తొలుత సందేహించిన ప్రియా, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఆ పాత్రను అంగీకరించినట్లు వెల్లడించింది. కెరీర్ ప్రారంభంలో విభిన్న పాత్రలు చేయడం ప్రయోజనకరమని వారు చెప్పడంతో ధైర్యం చేసిందని తెలిపింది. ఈ చిత్రంలోని 'ఉండిపోరాదే' పాట అనూహ్యంగా పెద్ద హిట్ కావడం తనకే ఆశ్చర్యం కలిగించిందని ప్రియా చెప్పింది. తాను వ్యక్తిగతంగా రొమాంటిక్ పాటలను అంతగా ఇష్టపడనందున, ఈ స్థాయి విజయాన్ని అసలు ఊహించలేదని పేర్కొంది. ప్రముఖ నటుడు అల్లు అర్జున్ వంటి వారు ప్రశంసించినప్పటికీ, తాను కేవలం ఆ పాటతోనే గుర్తుండిపోవాలని అనుకోవడం లేదని స్పష్టం చేసింది. నటిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు సాధించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నానని, 'హుషారు గర్ల్' లేదా 'ఉండిపోరాదే గర్ల్' అనే ఇమేజ్‌కు మాత్రమే పరిమితం కావాలనుకోవడం లేదని తెలిపింది. ఆ పాట వల్ల కొంతమేరకు అవకాశాలు వచ్చినప్పటికీ, అవి తాను ఆశించిన విధంగా లేవని ప్రియా వెల్లడించింది. అయినప్పటికీ, ఆ గుర్తింపును ఉపయోగించుకుని భవిష్యత్తులో మంచి పాత్రలు చేస్తూ తన ప్రతిభను నిరూపించుకోవాలని ఆమె సంకల్పించింది.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073